JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY
తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 254 శుక్రవారం, అక్టోబర్ 02 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## వేములకుంటలో అక్రమ తవ్వకాలు..
# రూ.2.44 కోట్ల ఆదాయానికి గండి?

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో మట్టి తరలింపు
- 40 అడుగుల లోతుకు తవ్వకాలపై ఆరోపణలు
- ప్రజావాణిలో ఫిర్యాదు.. సంబంధిత శాఖల తీరుపై అనుమానాలు

**హన్మకొండ జోర్దార్ నిఘా విభాగం**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ శివారులోని వేములకుంటలో అక్రమ మట్టి తవ్వకాలపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రైవేటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణం పేరుతో చెరువులో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపి, భారీగా మట్టిని తరలించి విక్రయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వేములకుంటలో ఏకంగా 40 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో టిప్పర్ మట్టిని రూ. 3,300 చొప్పున విక్రయిస్తూ సుమారు 7,400 టిప్పర్ల మట్టిని తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ లెక్కన రూ. 2.44 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మొత్తం ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయమా, ఎంత మేరకు




ఆదాయ నష్టం జరిగిందనే అంశాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. మరోవైపు, చెరువులో భారీగా తవ్వకాలు జరపడంతో సహజ వనరులు దెబ్బతినడమే కాకుండా, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బావుల్లో నీటి మట్టాలు తగ్గి సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? మట్టి తరలింపునకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై గట్ల నర్సింగాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లంపల్లి సుకుమార్ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమ తవ్వకాలపై సమగ్ర విచార ణ జరిపి, ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని లెక్కించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు స్పం దించి వాస్తవాలను వెలికితీస్తారా? అక్రమ తవ్వకాల ఆరో పణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..
# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!




**అమరావతి, అక్టోబర్ 1:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరి ంచింది. బీసీలకు 34 శా తం రిజర్వేషన్లు కల్పి స్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నా యని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వే షన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది.అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. కోరుతూ దాఖలైనవ్యాజ్యా లను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచా యతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.

## విద్యాశాఖ ఖర్చుల లెక్కలు తేల్చాలి..
# సమగ్ర ఆడిట్‌కు డిమాండ్!

- మూల్యాంకన పారితోషికాల నుంచి వర్క్‌షాపుల బిల్లుల వరకు ప్రతి చెల్లింపుపై పరిశీలన జరగాలి

**కరీంనగర్ జోర్దార్ నిఘా విభాగం**

విద్యాశాఖలో నిధుల వినియోగంపై నెలకొన్న సందేహాలకు తెరదించాలంటే సమగ్ర ఆర్థిక ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన పారితోషికాల్లో కోతలు జరిగాయన్న ఆరోపణలు, ఉపాధ్యాయులకు ఇంకా చెల్లించాల్సిన బకాయిలు, ప్రజాప్రతినిధుల వర్క్‌షాపుల వ్యయాలపై పూర్తి వివరాలు బయటకు రావాలని డిమాండ్ చేస్తున్నాయి. 2025లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు చెల్లించిన పారితోషికాల్లో కోతలు జరిగాయన్న ఆరోపణలు ఇప్పటికే చర్చకు వచ్చాయి. ఆన్‌లైన్ చెల్లింపుల నేపథ్యంలో ఎవరికెంత చెల్లించారు? ఎంత మొత్తం కోత పడింది? ఇంకా ఎంతమందికి బకాయిలు ఉన్నాయి? అనే వివ రాలపై స్పష్టత రావాల్సి ఉంది. 2022లో నిర్వహించిన కొన్ని మూల్యాంకనాలకు సంబంధించిన చెల్లింపులపైనా సందేహాలు వ్యక్తమవుతున్నందున, ఆయా సంవత్సరాల రికార్డులను పరిశీ లించి వాస్తవాలను వెల్లడించాలని ఉపాధ్యాయులు కోరుతు న్నారు.ఇదే సమయంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన వర్క్‌షాపుల ఖర్చులపై _నా లెక్కలు తేల్చాలని సూచిస్తున్నారు. కార్యక్రమాలకు ఎంతమంది హాజరయ్యారు? బిల్లుల్లో ఎంతమందిని చూపించారు? భోజనాలు, పార్టిసిపెంట్ కిట్లు, ఇతర ఏర్పాట్లకు ఎంత ఖర్చు చేశారు? వాస్తవంగా చెల్లించిన మొత్తమెంత? అనే అంశాలను సంబంధిత రికార్డుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉందని పేర్కొంటున్నారు. హాజరు సంఖ్యలో వ్యత్యాసాలున్నా యన్న ఆరోపణలపై కూడా విచారణ జరగాలని కోరుతున్నారు. ఈ రెండు అంశాలను విడివిడిగా కాకుండా, సంబంధిత ఆర్థిక రికార్డులన్నిం టినీ సమన్వయంతో పరిశీలించాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. మూల్యాంకనానికి సంబంధించిన విధుల కేటాయింపులు, ఉపాధ్యాయుల హాజరు, జవాబు పత్రాల




సంఖ్య, పారితోషికాల చెల్లింపులను సరిపోల్చడంతో పాటు వర్క్‌షాపుల హాజరు రిజిస్టర్లు, ఆహ్వానితుల జాబితాలు, ఫొటోలు, వీడియోలు, బిల్లులు, వోచర్లు, బ్యాంకు లావాదేవీలను తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయిఆరోపణలు నిజమో కాదో రికార్డులే తేల్చాలి! కేవలం ఆరోపణల ఆధారంగా ఎవరినీ బాధ్యులుగా ప్రకటించకుండా స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ఉపాధ్యా య వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. చెల్లిం పుల్లో లోపాలు ఉన్నట్లు తేలితే బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధి కారులు సమగ్ర ఆడిట్‌కు ఆదేశించి, నిధుల వినియోగంపై ప్రజలకు స్పష్టమైన వివరాలు అందించాలని డిమాండ్ చేస్తున్నాయి.

## హిందూ దేవుళ్లపై మాట్లాడితే
# ప్రజల మద్దతు రాదు



**హైదరాబాద్, అక్టోబర్ 1:** హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి శివుడు, శ్రీరాముడిని వేరు చేసి మాట్లాడుతున్నారని, అలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల అస్సాంకు చెందిన ప్రతిదిన్ అనే పత్రిక నిర్వహి ంచిన సదస్సులో రేవంత్? రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతు ందిహామీల గురించి అడగితే కొత్త వివాదాలు తెరపైకి తెస్తున్నారని, కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మెప్పుకోసమే రేవంత్ రెడ్డి అలా మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి విమర్శిం చారు. హిందూ దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు మీకు రాదని, హామీలు అమలు చేసి మంచి పాలన అందిస్తేనే ప్రజల మద్దతు కాం గ్రెస్ పార్టీకి వస్తుందని హితవు పలికారు. మ తం, కులం, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టిం చడం కాంగ్రెస్‌కు అలవాటేనని, రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుందని దుయ్యబట్టారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఇలాగే మాట్లాడి ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని గుర్తు చేశారు. "ముఖ్యమం త్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజలను అన్ని రకాలుగా విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీకే ఉంది. ప్రజలను ప్రాంతాల వారీగా విభజించి వైషమ్యాలు సృష్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని మతాల వారు శివుడిని కొలుస్తారు. స్వాతం త్ర్యం వచ్చిన నాటి నుంచి కులాలు, మతాలు, భాష పేరుతో, ఉత్తర, దక్షిణం వేరు అంటూ కాంగ్రెస్ విభేదాలు దృష్టిస్తుంది.

# 'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం'



**హైదరాబాద్, అక్టోబర్ 1:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పిం చారు.(గురువారం) మీడియాతో మాట్లాడు తూ.. ఎన్నో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యా ప్తంగా రైతులు బాధలో ఉన్నారని.. వారికి 6 గంటల కరెంట్ కూడా రావడం లేదని తెలిపా రు. మోసపోతే గోసపడతారని కేసీఆర్ ఎప్పుడో చెప్పారని గుర్తుచేశారు. పాత రోజులు మళ్లీ తీసుకొస్తామని రేవంత్ చెప్పారని.. చెప్పినట్టే ఇబ్బందులు ఉన్న పాత రోజులు తెచ్చారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం, కరెంట్ కొనుగో ళ్లపై కమిషన్లు తుస్సుమన్నాయని అన్నారు. ఫార్ములా-ఈపై కేసు పెట్టారని.. ఏం తేల్చారని ప్రశ్నించారు.సీఎంకు సవాల్'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ సోదరులకు రూ. 1,00 0 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ.. దీనిపై సిట్టింగ్ జడ్జికి లేఖ రాసేందుకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'మిమ్మల్ని వదలం.. హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. మా తాతకు చింతమడకలో వందల ఎకరాలు ఉండేవి. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా సీఎంకు పంపిస్తా' అని కేటీఆర్ పేర్కొన్నారు. రెడ్డి బాధ ఏంటో ఎవరికీ అర్థంకావడం లేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లలో 35 మంది నేత కార్మికులు చనిపోయారన్నారు.

# టీసీ ఇచ్చి పంపించారంటూ ఆరోపణలు..
# ప్రిన్సిపాల్‌ను తొలగించాలని డిమాండ్

- అక్క మృతి తర్వాత పాఠశాలకు వచ్చిన బాలికకు మానసిక వేధింపులంటూ యుఎస్ఎఫ్ఐ ఆరోపణ..
- సమగ్ర విచారణకు విజ్ఞప్తి

**హనుమకొండ జోర్దార్ నిఘా విభాగం**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినికి టీసీ ఇచ్చి పంపించిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. కుటుంబంలో అక్క మృతి చెందడంతో కొంతకాలం ఇంటికి వెళ్లిన బాలిక తిరిగి పాఠశాలకు వచ్చిన తర్వాత ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురిచేసి, పాఠశాల నుంచి పంపించారని యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ ఆరోపించారు. కుటుంబంలో విషాదం కారణంగా బాధలో ఉన్న బాలికకు అండగా నిలిచి చదువు కొనసాగించేలా ప్రోత్సహించాల్సింది పోయి, పాఠశాలలో కొనసాగడం ఇష్టం లేదంటూ ప్రిన్సిపాల్ ఒత్తిడి తెచ్చారని రాజేష్ నాయక్ పేర్కొన్నారు. విద్యార్థినితోనే టీసీ కోరుతున్నట్లు రాయించి మరో పాఠశాలకు వెళ్లేలా పంపించారని ఆరోపిం చారు. ఈ పరిణామంతో బాలిక విద్యాభవిష్యత్తుపై ఆందోళన నెలకొందని తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రతతోపాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని రాజేష్ నాయక్ అన్నారు. కుటుంబంలో విషాదాన్ని ఎదుర్కొంటున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ అందించి, వారి చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గురుకులంలో మా నసిక నిపుణులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

**గత ఘటనపైనా విచారణ జరపాలి**

వంగర గురుకులంలో గతంలో ఓ విద్యార్థిని మృతి చెందిన ఘటనపైనా అధికారులు స్పష్టత ఇవ్వాలని రాజేష్ నాయక్ కోరారు. ప్రస్తుత టీసీ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించడంతోపాటు విద్యార్థినికి చదువు కొనసాగించే అవకాశం కల్పించాలని కోరారు. అధికా రులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

## బాలల రక్షణ శాఖలో వరుస ఆరోపణలు..

# గత కథనాలపై చర్యలేవీ?




**వరంగల్ జోర్దార్ నిఘా విభాగం**

బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధం వంటి కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన వరంగల్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో పలు అంశాలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? విచారణలు పూర్తయ్యాయా? లోపాలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది. తాజాగా బాల్య వివాహాల కేసుల నిర్వహణ, ఉద్యోగ నియామకానికి సమర్పించిన నివాస ధ్రువపత్రం, ఆర్థిక సహాయ పథకం అమలుపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంలో శాఖకు సంబంధించిన పలు అంశాలపై కథనాలు ప్రచురితమైనప్పటికీ, వాటిపై తీసుకున్న చర్యల వివరాలు బహిరంగంగా వెల్లడయ్యాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులపై విచారణ జరిగిందా? సంబంధిత రికార్డులను అధికారులు పరిశీలించారా? ఏవైనా అవకతవకలు గుర్తించారా? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒకవైపు గత ఆరోపణలపై చర్యల వివరాలు తెలియకపోవడం, మరోవైపు కొత్త ఫిర్యాదులు తెరపైకి రావడం శాఖ పనితీరుపై చర్చకు దారితీస్తోంది. 2020 నుంచి ఇప్పటివరకు వరంగల్ జిల్లాలో బాల్య వివాహాలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, గుర్తించిన ఘటనలు, అడ్డుకున్న వివాహాలు, పోలీసులకు అందించిన సమాచారం, నమోదైన కేసులు, తదుపరి చర్యలను కేసుల వారీగా పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు. బాల్య వివాహం జరిగినట్లు సమాచారం అందినా కేసు నమోదు చేయని సందర్భాలున్నాయా? కేసుల నమోదులో జాప్యం జరిగిందా? నమోదైన కేసుల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అనే అంశాలను తేల్చాలని పేర్కొన్నారు. బాధిత బాలికల ప్రస్తుత పరిస్థితి, వారి సంరక్షణ, విద్య కొనసాగింపు, భద్రత, పునరావాసం కోసం తీసుకున్న చర్యలను కూడా పరిశీలించాలని కోరారు. బాలల సంక్షేమ కమిటీ రికార్డులపైనా సమగ్ర తనిఖీ చేయాలని ఫిర్యాదుదారు డిమాండ్ చేశారు. 2020 ఫిబ్రవరి 8 నుంచి ఇప్పటివరకు కమిటీ పరిధిలోకి వచ్చిన బాల్య వివాహాల కేసులకు సంబంధించిన రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, తీర్మానాలు, ఉత్తర్వులు, విచారణ నివేదికలు, పోలీసు రికార్డులను పరస్పరం సరిపోల్చి పరిశీలించాలని కోరారు. కేసులను నమోదు చేయకుండా వదిలేశారా? వాస్తవాలకు భిన్నమైన వివరాలను నమోదు చేశారా? బాధిత పిల్లలకు అందించాల్సిన రక్షణ, పునరావాస చర్యల్లో లోపాలున్నాయా? అనే అంశాలపై విచారణ జరపాలని పేర్కొన్నారు.

బాలల రక్షణ సిబ్బంది, బాలల సంక్షేమ కమిటీ మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా చర్యలు జరిగాయా అనే కోణంలోనూ స్వతంత్ర అధికారితో దర్యాప్తు చేయాలని కోరారు. మరోవైపు, ఉద్యోగ నియామకానికి సమర్పించిన నివాస ధ్రువపత్రంపై కూడా ఆరోపణలు వ్యక్తమయ్యాయి. 2022లో బాలల రక్షణ విభాగంలో విధుల్లో చేరిన సమయంలో శాయంపేట మండలానికి చెందిన నివాస ధ్రువపత్రాన్ని సమర్పించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, సంబంధిత వ్యక్తి వాస్తవ నివాసం భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల పరిధిలో ఉన్నట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ధ్రువపత్రం ఏ ఆధారాలతో జారీ అయింది? అందులో పేర్కొన్న నివాస వివరాలు వాస్తవమైనవేనా? నియామక సమయంలో సమర్పించిన పత్రాలను అధికారులు సరిగా పరిశీలించారా? అనే అంశాలను మొగుళ్లపల్లి, శాయంపేట మండలాల రెవెన్యూ రికార్డులు, ఉద్యోగ నియామక పత్రాల ఆధారంగా విచారించాలని కోరారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. ఆర్థిక సహాయ పథకం అమలుపైనా ఫిర్యాదులో పలు అంశాలను ప్రస్తావించారు. 2025 జూలై నుంచి ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరు, చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. లబ్ధిదారులు లేదా వారి కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, చెల్లింపుల వివరాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని పేర్కొన్నారు. ఈ అంశంలోనూ ఆరోపణలు నిజమో కాదో విచారణ ద్వారానే తేలాల్సి ఉంది.

ఒకే శాఖకు సంబంధించి గతంలో వచ్చిన కథనాలు, తాజా ఫిర్యాదుల్లో ప్రస్తావించిన అంశాలపై వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. గతంలో అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న విచారణలు, బాల్య వివాహాల కేసుల నిర్వహణ, బాలల సంక్షేమ కమిటీ కార్యకలాపాలు, ఉద్యోగ నియామక ధ్రువపత్రం, ఆర్థిక సహాయ పథకం అమలుపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే సంబంధిత ఆధారాలతో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. బాలల భద్రతకు సంబంధించిన శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరని, గత కథనాలపై తీసుకున్న చర్యలతోపాటు తాజా ఫిర్యాదుల విచారణ పురోగతిని అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కరీనగర్ డీసీడీసీ లో. రిటైర్డ్ సీఈఓ

# అక్రమాలపై ఏసీబీతో దర్యాప్తు చేయాలి

- నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి అదే పదవిలో కొనసాగింప
- మాజీ అధ్యక్షుడు రవీందర్ రావు అండదండలతోనే చక్రం తిప్పుతున్న వైనం
- కోట్ల రూపాయల కుంభకోణాలపై విచారణ జరిపి, తక్షణమే తొలగించాలని డిమాండ్

**(కరీనగర్: జోర్దార్. నిఘా బృందం)**

కరీనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లో పరిపాలనా వైఫల్యాలు, నిబంధనల ఉల్లంఘనలు తారాస్థాయికి చేరాయి. రిటైర్మెంట్ వయసు ముగిసినప్పటికీ, ఎలాంటి నిబంధనలకు లొంగకుండా ఒకే వ్యక్తి దశాబ్దాలుగా సీఈఓ పదవిని అంటిపెట్టుకుని ఉండడం సహకార రంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ అధ్యక్షుడు కే రవీందర్ రావు అండదండలతోనే ఈ తంతు నడుస్తోందని, కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని రైతులు, మాజీ చైర్మన్లు, వివిధ పార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పదవీ విరమణ తర్వాత కూడా.. చెక్కుచెదరని పట్టు**

కరీనగర్ డీసీడీసీ బ్యాంకులో సీఈఓగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణరావు వాస్తవానికి ఎప్పుడో ఉద్యోగ విరమణ (రిటైర్డ్) పొందిన అయితే, నిబంధనలకు విరుద్ధంగా తన పదవీకాలాన్ని ఎక్స్‌టెన్షన్ (పొడిగింపు) తెచ్చుకుంటూ వస్తున్నారు. సహకార సంఘాల నిబంధనల ప్రకారం అర్హులైన ఇతరులకు ఎవరికీ అవకాశం కల్పించకుండా, గత కొన్ని సంవత్సరాలుగా కేవలం ఒక్కరికే ఆ సీటు పరిమితమయ్యేలా చక్రం తిప్పుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పదవిలో కొనసాగడం పట్ల సహకార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

**రవీందర్ రావుకు 'బినామీ'గా వ్యవహరిస్తూ..**

బ్యాంకు మాజీ అధ్యక్షుడు రవీందర్ రావుకి ఈ సీఈఓ అండదండలు మెండుగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. బ్యాంకు అధ్యక్షుడిగా రవీందర్ రావు పదవీకాలం ముగిసిన తర్వాత, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ఐఏఎస్ కలెక్టర్ ఆ బాధ్యతలో ఉంటుంది. అయితే, ఆ నిబంధనలను పక్కనబెట్టి రవీందర్ రావు అక్రమంగా ఛార్జ్ కొనసాగించే విషయంలోనూ, బాధ్యతల బదలాయింపులోనూ సత్యనారాయణరావు తెర వెనుక కీలక పాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. రవీందర్ రావుకి బినామీ తరహాలో వ్యవహరిస్తూ బ్యాంకులో సర్వస్వం తానై నడిపిస్తున్నారని విమర్శలున్నాయి.

**అభివృద్ధి పనుల పేరిట కోట్ల కుంభకోణం?**

బ్యాంకులో ?వివిధ అభివృద్ధి పనులు, ఇతర ఆర్థిక లావాదేవీల పేరిట డీసీడీసీ బ్యాంకులో కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు ఈ రిటైర్డ్ సీఈఓపై ఉన్నాయి. బ్యాంకు నిధులను ఇష్టారాజ్యంగా మళ్లించారని, సహకార రంగాన్ని భ్రష్టు పట్టించారని రైతులు మండిపడుతున్నారు.

**తక్షణమే తొలగించాలని డిమాండ్**

పదవీ విరమణ పొందిన వ్యక్తిని సీఈఓగా కొనసాగించడం చట్టవిరుద్ధమని, వెంటనే ఆయన్ను ఆ పదవి నుంచి తొలగించాలని రైతులు, బ్యాంకు మాజీ చైర్మన్లు డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన సమర్థులకు ఆ బాధ్యతలు అప్పగించాలని కోరుతూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సహకార శాఖాధికారులు స్పందించి, డీసీడీసీ బ్యాంకులో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# సంపాదకీయం




## నష్ట నివారణలో ఇసి

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. ఈమేరకు శనివారం ఎన్నికల సంఘం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేకపోవడం గమనార్హం. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది. స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు. అలాగే ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్ఒ, ఎఇఆర్ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది. అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వవస్థీకరించాలి.

## మైనర్ల డిజిటల్ భద్రతకు చట్టరక్షణ




మన దైనందిన జీవితంలో సామాజిక మాధ్యమాలు విడదీయలేని భాగంగా మారాయి. సమాచారాన్ని తెలుసుకోవడం, భావాలను వ్యక్తం చేయడం, ప్రపంచంతో అనుసంధానమవడం వంటి ఎన్నో ప్రయోజనాలు వీటి ద్వారా చేకూరుతున్నాయి. అయితే ఇదే వేదికలు బాలబాలికల పాలిట ప్రమాదకరంగా మారుతున్న సందర్భాలూ పెరుగుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. సైబర్ వేధింపులు, అసభ్యకరమైన కంటెంట్, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ వ్యసనం వంటి సమస్యలు వారి శారీరక, మానసిక వికాసంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవడానికి తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మైనర్లు సామాజిక మాధ్యమాలను ఉపయోగించడం సమస్య కాదు. వారి వయసుకు తగిన అవగాహన, విచక్షణ, పరిణతితో సంబంధం లేకుండా ఎలాంటి నియంత్రణలూ లేని వాతావరణంలోకి ప్రవేశించడమే అసలు సమస్య. పిల్లలను ఆకట్టుకునేలా రూపొందించిన

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

శుక్రవారం,
అక్టోబర్ 02 2026



# వృద్ధాప్యం




అందరూ ఉండి కూడా
ఎవరూలేని అనాధలు వారు
బతుకుపోరులో కష్టం-సుఖం
నష్టంలాభంఅన్నీచూసినారు
జీవితగమనంలోఅన్నీ చూసి
నేడు ఒంటరి అయినవారు

శరీరంసహకరించక
ఆరోగ్యంబాగుపడక
ఇకచేయడానికిఏమీలేదని
బతుకేభారంగాకాటికిపోదాం
అని బతుకుతున్నవారు

మానవజీవితంచివరిదశలో
కాలంవెళ్ళదీస్తున్నవారు
వృద్ధులుఆదర్శనీయులు
మనకుమార్గదర్శకులు

వారిఅనుభవాలుపాఠాలుగా
వారిమాటలకువిలువనిచ్చి
వారుచూపినబాటనేదారిగా
వృద్ధాప్యంవారికిశాపంఅనే
భావననుండిఅదొకవరంగా
వారికి వరం ఇద్దాం!

కాపాడుకుందాం
వారిని ఆసాంతం..
వారికితోడుందాంనిరంతరం,
వృద్ధాప్యంశాపంగా కాకుండా
వరంగావారినిబతకనిద్దాం!
బతుకునుఇద్దాం!!



ఎన్.రాజేష్-కవి,జర్నలిస్ట్,
హైదరాబాద్-9849335757

# బీసీ రక్షణ చట్టం కోసం ఉద్యమం ఉధృతం చేస్తాం

- దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**బీసీలపై దాడులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న డిమాండ్ చేశారు. బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు గురువారం హుజురాబాద్ పట్టణంలోని స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో బీసీ రక్షణ చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ రక్షణ చట్టం తరహాలో తెలంగాణతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థలు, చట్టసభల్లో కనీసం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, విద్యా, ఉద్యోగ రంగాల్లోనూ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఆకుల సదానందం, కొలిపాక క్రాంతికుమార్, మామునూరి ప్రవీణ్‌కుమార్, తాళ్లపల్లి రమేష్, మంచికట్ల మురళి, చిలుకమారి శ్రీనివాస్, దేవసాని ప్రియదర్శిని, మంద బిక్షపతి, కానుగంటి శ్రీనివాస్, గోస్కుల మధుకర్, గరవేనా శ్రీకాంత్, కన్నెబోయిన రాజయ్య, దాసరి మల్లేశం, పిల్లి రాజు, రావుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానంతో ప్రాణాలను కాపాడొచ్చు




**హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)**జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్) రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన ర్యాలీ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం (యూఎఫ్‌డబ్ల్యూసీ) వద్ద ప్రారంభమైన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు.

కుమార్‌పల్లి మీదుగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది.

ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానంపై అపోహలు వీడి, దీనిని గొప్ప మానవతా సేవగా భావించాలని సూచించారు.

అనంతరం వైద్య సిబ్బంది, అధికారులు స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ చేశారు.

ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, జీఎంహెచ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల, డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సీహెచ్ఓ ప్రేమలత, డెమోలు సువార్త, ఎల్లయ్య, రవీందర్, ఎంపీహెచ్ఈఓ విప్లవ్ కుమార్, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు శ్రీనివాసరావు, జ్యోతి, పీహెచ్ఎన్ రామేశ్వరి, సూపర్‌వైజర్ బజ్జీ సమ్మా, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, కమలాకర్, కేసీ కుమార్, శరత్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్‌పల్లిలో ప్రత్యేక వైద్య శిబిరం



**కమలాపూర్,(జోర్దార్ ప్రతినిధి)**కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మర్రిపల్లి గూడెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 72 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలతో వచ్చిన 9 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, సర్పంచ్ పెండ్యాల మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మాందాటి రాజు, ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్లు బాబు, గోవర్ధన్, ఆశా కార్యకర్తలు అనురాధ, కవిత, మౌనిక, సునీత, రజితతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి

## రవాణా వివరాలను వెల్లడించిన జి.ఎం

**సింగరేణి జోర్దార్ ప్రతినిధి:**సెప్టెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఎస్వోటుజియం బండిసత్యనారాయణ గురువారం జీ.యం కార్యక్రమంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 2.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.50 లక్షల టన్నులు అనగా 65 శాతం బొగ్గు ఉత్పత్తి, తో పాటు, కంపనీ షావల్స్ కు నిర్దేశించిన 08.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను, 7.42 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 93 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, ఆఫ్ లోడింగ్ కు నిర్దేశించిన 13:00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి లక్ష్యానికి గాను 9.84 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 76 శాతం మట్టిని వెలికితీయడం జరిగిందన్నారు. అదేవిధంగా 3.67 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనుల వారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ఆగస్టు నెలలో ఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 0.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 0.60 లక్షల టన్నులు అనగా 201 శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.90 లక్షల టన్నులు అనగా 45 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు. సెప్టెంబర్ మాసంలో



Production performance of RG-3 Area for Sep-2026

Coal in LT

| S.No | Mine | Sep-26 Target(in LT) | Sep-26 Actual/Dispatch(in LT) | Sep-26 %Ach | Prog.Up to Sep-26 Target(in LT) | Prog.Up to Sep-26 Actual/Dispatch(in LT) | Prog.Up to Sep-26 %Ach | Sep-25 Target(in LT) | Sep-25 Actual(in LT) | Sep-25 %Ach | Prog.Up to Sep-25 Target(in LT) | Prog.Up to Sep-25 Actual(in LT) | Prog.Up to Sep-25 %Ach |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | RGOC1 | 0.30 | 0.60 | 201 | 2.25 | 5.79 | 257 | 2.40 | 1.20 | 50 | 16.00 | 12.62 | 79 |
| 2 | RGOC2 | 2.00 | 0.90 | 45 | 13.50 | 9.50 | 70 | 2.00 | 1.90 | 95 | 13.50 | 12.51 | 93 |
| | RG3 Area | 2.30 | 1.50 | 65 | 15.75 | 15.29 | 97 | 4.40 | 3.10 | 70 | 29.50 | 25.13 | 85 |

OBR in Lcu.M(Company shovels)

| S.No | Mine | Sep-26 Target (in Lcu.M) | Sep-26 Actual (in Lcu.M) | Sep-26 %Ach | Prog.Up to Sep-26 Target (in Lcu.M) | Prog.Up to Sep-26 Actual (in Lcu.M) | Prog.Up to Sep-26 %Ach | Sep-25 Target (in Lcu.M) | Sep-25 Actual (in Lcu.M) | Sep-25 %Ach | Prog.Up to Sep-25 Target (in Lcu.M) | Prog.Up to Sep-25 Actual (in Lcu.M) | Prog.Up to Sep-25 %Ach |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | RGOC1 | 3.00 | 2.48 | 83 | 21.00 | 20.01 | 95 | 4.50 | 4.79 | 107 | 29.50 | 29.89 | 101 |
| 2 | RGOC2 | 5.00 | 4.94 | 99 | 36.50 | 30.16 | 83 | 5.00 | 3.81 | 76 | 36.50 | 26.77 | 73 |
| | RG3 Area | 8.00 | 7.42 | 93 | 57.50 | 50.17 | 87 | 9.50 | 8.60 | 91 | 66.00 | 56.67 | 86 |

Offloading - OBR (L.Cu.M)

| S.No | Mine | Sep-26 Target (in Lcu.M) | Sep-26 Actual (in Lcu.M) | Sep-26 %Ach | Prog.Up to Sep-26 Target (in Lcu.M) | Prog.Up to Sep-26 Actual (in Lcu.M) | Prog.Up to Sep-26 %Ach | Sep-25 Target (in Lcu.M) | Sep-25 Actual (in Lcu.M) | Sep-25 %Ach | Prog.Up to Sep-25 Target (in Lcu.M) | Prog.Up to Sep-25 Actual (in Lcu.M) | Prog.Up to Sep-25 %Ach |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | OC1 (HD)/OC2-C5 SUSHEE | – | – | – | – | – | – | 18.00 | 3.52 | 20 | 152.00 | 61.15 | 40 |
| 1 | OC2-C-5 INFRA | 13.00 | 9.84 | 76 | 96.00 | 89.91 | 94 | – | – | – | – | – | – |
| | Total | 13.00 | 9.84 | 76 | 96.00 | 89.91 | 94 | 18.00 | 3.52 | _ | 152.00 | 61.15 | 40 |

RG-3 Area OBR (Company+ Offloading) (L.Cu.M)

| S.No | Mine | Sep-26 Target (in Lcu.M) | Sep-26 Actual (in Lcu.M) | Sep-26 %Ach | Prog.Up to Sep-26 Target (in Lcu.M) | Prog.Up to Sep-26 Actual (in Lcu.M) | Prog.Up to Sep-26 %Ach | Sep-25 Target (in Lcu.M) | Sep-25 Actual (in Lcu.M) | Sep-25 %Ach | Prog.Up to Sep-25 Target (in Lcu.M) | Prog.Up to Sep-25 Actual (in Lcu.M) | Prog.Up to Sep-25 %Ach |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | RG-3 Area | 21.00 | 17.26 | 82 | 153.50 | 140.07 | 91 | 27.50 | 12.12 | 44 | 218.00 | 117.82 | 54 |

Dispatches (LT)

| | Sep-26 | Prog.Up to Sep-26 | Sep-25 | Prog.Up to Sep-25 |
|---|---|---|---|---|
| OC1 CHP+ Road | 3.67 | 30.11 | 4.14 | 32.22 |

Rainfall details

| S.No | Mine | Sep-26 | Prog.Up to Sep-26 | Sep-25 | Prog.Up to Sep-25 |
|---|---|---|---|---|---|
| 1 | RGOC1 | 456 mm | 1476 mm | 503 mm | 1732 mm |
| 2 | RGOC2 | 367 mm | 1527 mm | 485 mm | 1719 mm |

Production Performance of ALP for the month of Sep-2026

| Mine | Tech. | Sep-26 Targets in (T) | Sep-26 Actual/Dispatch in (T) | Sep-26 %Ach | Sep-25 Targets in (T) | Sep-25 Actual in (T) | Sep-25 %Ach |
|---|---|---|---|---|---|---|---|
| ALP | LHD | 9,500 | 9,673 | 102 | 9,500 | 13,266 | 140 |
| | SDL | 800 | 2,661 | 333 | 800 | 1372 | 172 |
| | RH | 5,000 | 1,890 | 38 | 5,000 | 0 | 0 |
| | Total* | 15,300 | 14,224 | 93 | 15,300 | 14,638 | 96 |

అధిక వర్షాలు కురిసి నందున ఉత్పత్తిలో కొంత వెనుకపడ్డామని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఎస్వోటుజిఎం బండి సత్యనారాయణ మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు సెప్టెంబర్ నెలలో నిర్దేశించిన 15,300 టన్నుల లక్ష్యానికి గాను 14,224 టన్నులు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. 4వ ప్యానల్ తయారీ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. అలాగే ఉద్యోగులు చాలా మంది గైర్హాజరు అవుతున్నారని, గైర్హాజరు కాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ఐ ఇ డీజీఎం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం యండి.ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల విద్యకు తొలి అడుగు

## అంగన్వాడీలో అక్షరాభ్యాసం



**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**మండలంలోని నాగేపల్లి గ్రామంలో చిన్నారుల విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని అంగన్వాడీ-3 కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల తొలిదశ విద్యాభ్యాసంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం అందించడంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అక్షరాభ్యాస కార్యక్రమంతో అంగన్వాడీ కేంద్రంలో సందడి నెలకొంది.

# వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



**జోగులాంబ గద్వాల,జోర్దార్ ప్రతినిధి:**వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పట్టణంలోని వివిధ కాలనీలు, ప్రధాన వీధుల్లో కుక్కల సమస్యను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా వీధి కుక్కలకు టీకాలు వేయడంతో పాటు సంతాన నిరోధక చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

కుక్కల బెడదపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, సమస్య తీవ్రతను బట్టి తగిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.

# వేములకుంటలో మట్టి దందా

## అధికారుల తీరుపై అనుమానాలు!

- 40 అడుగుల లోతుకు తవ్వకాలు.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో మట్టి తరలింపు?
- 7,400 టిప్పర్లు.. రూ.2.44 కోట్ల ఆదాయానికి గండిపై ఆరోపణలు
- ప్రజావాణిలో ఫిర్యాదు.. సమగ్ర విచారణకు బాధితుల డిమాండ్



**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:**భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ శివారులోని 'వేములకుంట'లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనుల పేరుతో చెరువు ప్రాంతం నుంచి నిబంధనలకు విరుద్ధంగా భారీగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల అనుమతులు, తవ్వకాల పరిమితులు, మట్టి తరలింపునకు సంబంధించిన అధికారిక లెక్కలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

### 40 అడుగుల లోతుకు తవ్వకాలు?

సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వేములకుంటలో ఏకంగా 40 అడుగుల లోతు వరకు మట్టి తవ్వినట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించినట్లు చెబుతున్నారు. చెరువు సహజ స్వరూపాన్ని దెబ్బతీసేలా తవ్వకాలు జరిగాయా? వాటికి ఎవరు అనుమతులు ఇచ్చారు? అనుమతులు ఉంటే ఎంత మేరకు తవ్వకాలకు అనుమతి ఉంది? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

### 7,400 టిప్పర్లు.. రూ.2.44 కోట్ల లెక్క?

ఒక్కో టిప్పర్ మట్టికి సుమారు రూ.3,300 చొప్పున లెక్కించి దాదాపు 7,400 టిప్పర్ల మట్టి తరలించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన రూ.2,44,20,000 విలువైన మట్టి తరలింపు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ మొత్తం ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయమా? ఎంత మేర రాయల్టీ, ఇతర చార్జీలు చెల్లించారు? ఎంత పరిమాణంలో మట్టి తరలించేందుకు అధికారిక అనుమతులు ఉన్నాయి? అన్నది సంబంధిత అధికారులు తేల్చాల్సి ఉంది.

### భూగర్భ జలాలపై రైతుల ఆందోళన

కుంటలో లోతైన తవ్వకాలు చేపట్టడం వల్ల పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులపై ప్రభావం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతే సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంటను యథేచ్ఛగా తవ్వడం వల్ల పర్యావరణంపై, స్థానిక నీటి వనరులపై ఎలాంటి ప్రభావం పడిందన్న అంశంపై సాంకేతికంగా పరిశీలన జరపాలని వారు కోరుతున్నారు.

### ప్రజావాణిలో ఫిర్యాదు.. విచారణ కోసం ఎదురు చూపులు

వేములకుంటలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమ తవ్వకాలపై గట్ల నర్సింగాపూర్‌కు చెందిన బొల్లంపల్లి సుకుమార్ ప్రజావాణిలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి తవ్వకాల పరిమాణం, అనుమతులు, మట్టి తరలింపు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు తదితర అంశాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల పరిధిలో ఎవరెవరి బాధ్యత ఎంత? గతంలో ఎలాంటి తనిఖీలు జరిగాయి? ఫిర్యాదులు వచ్చినా చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే అంశాలపై కూడా ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అక్రమ తవ్వకాలపై వచ్చిన ఆరోపణలు నిజమా? కేవలం అనుమతుల పరిధిలోనే మట్టి తరలింపు జరిగిందా?

ప్రభుత్వ ఆదాయానికి ఎంత మేర నష్టం వాటిల్లింది? అన్నది అధికారిక విచారణ తోనే తేలాల్సి ఉంది.

# చూటూరులో ఘనంగా పచ్చ పండగ వేడుకలు



■ గిరిజన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకగా మూడు రోజుల పాటు ఉత్సవాలు

**చింతూరు,ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో:**చింతూరు మండలం చూటూరు గ్రామంలో తరతరాలుగా కొనసాగుతున్న గిరిజన సంప్రదాయాల ప్రకారం పచ్చ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో వేడుకలు జరుపుకుంటున్నారు.

పండగ సందర్భంగా గ్రామదేవతలైన కోడలమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి, భీముడి తంబలితో పాటు ఇతర గ్రామ దేవతలకు గ్రామ పెద్దలు పటేలు, పూజారి, వ్యాపారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతలకు నీళ్లు పోసి కోళ్లు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామంలోని మహిళలందరూ కలిసి దేవతలకు నీరు పోసి పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చూటూరు గ్రామ ఉద్యోగులు మహిళలకు జాకెట్ ముక్కలను అందజేశారు. గ్రామ పెద్దలు, ఉద్యోగులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండగను విజయ వంతం చేశారు.గ్రామ సంప్రదాయాలు, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. యువత మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ గ్రామాన్ని పచ్చ దనంతో నింపాలని సూచించారు. గ్రామం పచ్చదనంతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పాత కక్షలతో రాకేష్ హత్య

■ నలుగురు అరెస్ట్
■ ఐదుగురు పరారీ..
■ కత్తులు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామ శివారులో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ వద్ద సెప్టెంబర్ 27న జరిగిన రాకేష్ హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం ఉప్పల్‌పల్లి గ్రామానికి చెందిన వడిగే రాకేష్ (30) మృతదేహం సెప్టెంబర్ 28న ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువలో లభించింది. మృతుడి తల్లి దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో రాకేష్‌కు అమరగొండ ప్రశాంత్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే ఆరోపణల నేపథ్యంలో గతంలో ఇద్దరి మధ్య వివాదాలు జరిగినట్లు వెల్లడైంది. ఈ పాత కక్షలతో ప్రశాంత్ హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. పథకం ప్రకారం రాజ్‌కుమార్ రాకేష్‌ను ఎల్కతుర్తికి రప్పించి, అక్కడి నుంచి హుజురాబాద్‌కు తీసుకొచ్చి మద్యం సేవించిన అనంతరం పెద్ద పాపయ్యపల్లి శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ వద్దకు తీసుకెళ్లాడు.

అక్కడికి చేరుకున్న నిందితులు రాకేష్‌పై కత్తులతో దాడి చేయగా, ప్రశాం త్ గొంతుపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అనంతరం మృతదేహాన్ని కాలువలో పడవేసి నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్కతు ర్తిలోని ఓ అద్దె ఇంట్లో ఉన్న అమరగొండ ప్రశా ంత్, రాజ్‌కుమార్, అమరగుండ రిత్విక్, తుమ్మల అఖిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తు లు, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మరో నిందితులు టి. అఖిల్, రాహుల్, బి. చందు, బి. అజయ్, గణే ష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది. అరెస్టయిన నిందితులను వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో భారీ కుంభకోణం

■ మూల్యాంకన భత్యంలో కోత.. వర్క్‌షాపుల నిధుల్లో గోల్‌మాల్?

**కరీంనగర్ జోర్ధార్ ప్రతినిధి:**రాష్ట్ర విద్యాశాఖలో 2025 సంవత్సరానికి సంబంధించిన వివిధ చెల్లింపులు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ తీరు ఇప్పుడు విస్తృత చర్చకు దారితీస్తోంది. ఇటీవల జవాబు పత్రాల మూల్యాంకన పారితోషికంలో కోత విధించారనే అంశం ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. దీని కొనసాగింపుగా ఇప్పుడు మరికొన్ని ఆర్థిక వ్యవహారాలపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మూల్యాంకన భత్యంలో కోత -- సైన్స్ జవాబు పత్రాల పారితోషికం గల్లంతు?**

ఉపాధ్యాయ సంఘాల కథనం ప్రకారం, ఫిజికల్ సైన్స్ మరియు బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకన భత్యం పూర్తి స్థాయిలో అందలేదు. నిబంధనల ప్రకారం రావాల్సిన మొత్తంలో తేడా ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 2022 సంవత్సరంలో కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైందని గుర్తుచేస్తున్నారు.

**వర్క్‌షాపుల పేరిట దొంగ బిల్లులు -- భోజనాల లెక్కల్లో అక్రమాలు?**

సర్పంచుల వర్క్‌షాపుల నిర్వహణకు సంబంధించి అందుతున్న ఆరోపణల ప్రకారం, వర్క్‌షాపులకు హాజరైన వారి సంఖ్యకు, బిల్లుల్లో చూపిన సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు తక్కువ మంది హాజరైనా ఎక్కువ మంది పేరిట భోజన, ఇతర ఖర్చులు చూపించారనే విమర్శ ఉంది. ఒక కేంద్రంలో 40 మంది హాజరైతే 140 మంది పేరిట బిల్లులు సమర్పించారనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధులు ఎలా ఖర్చయ్యాయనే దానిపై లెక్కలు బహిరంగపరచాలని డిమాండ్ వినిపిస్తోంది.

**నోడల్ అధికారుల తీరుపై అనుమానాలు -- పర్యవేక్షణ లోపమే కారణమా?**

కొంతమంది క్షేత్రస్థాయి అధికారులు నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణ ఉంది. పైస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఇందుకు కారణమై ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాధారణ ఉపాధ్యాయుడు తన శ్రమకు తగిన ప్రతిఫలం ఆశిస్తే, వ్యవస్థలోని లోపాల వల్ల నష్టపోవాల్సి వస్తోందని సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారంలో విచారణ జరిపితేనే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ప్రభుత్వం చొరవ తీసుకుని, చెల్లింపుల ప్రక్రియను పారదర్శకంగా మార్చాలని, వర్క్‌షాపుల నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని వారు కోరుతున్నారు. బాధ్యత నిర్ధారణ జరిగి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ఆరోపణలు పునరావృతం కావని వారి అభిప్రాయం.

మరోవైపు ఈ ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. విచారణ తర్వాతే నిర్ధారణకు రావాలని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో వైద్య ఆరోగ్యశాఖ హనుమకొండ ఆధ్వర్యంలో గురువారం టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరై టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు, వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు.టీబీ నిర్మూలన లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంఘాలు, ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రదీప్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గునిపర్తిలో పంచరాయి భూముల రీ--సర్వే పరిశీలన

**కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:**కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామంలో పంచరాయి భూముల రీ--సర్వే ప్రక్రియను తహసీల్దార్ సురేష్ కుమార్ గురువారం పరిశీలించారు. గ్రామంలోని సర్వే నంబర్ 339లో కొనసాగుతున్న రీ--సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు.రీ--సర్వే పనుల పురోగతిపై మండల సర్వేయర్, సంబంధిత సిబ్బందితో సమీక్షించారు. భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రీ--సర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, గునిపర్తి జీపీఓ, సర్పంచ్, సంబంధిత సిబ్బంది, స్థానికు లు పాల్గొన్నారు.




# 12వ సారి రక్త దానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్

■ అభినందించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ జిల్లా, జోర్దార్ ప్రతినిధి:** జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడిసర్కిల్ వ్యవస్థాపకులు, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ ( ఫైమా) జాతీయ కార్యవర్గ సభ్యులు, డాక్టర్ అశ్విని నవదీప్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం మహబూబ్ నగర్ లోని రెడ్ క్రాస్ భవన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం లో ప్రభుత్వ విప్ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రెడ్ క్రాస్ నూతన చైర్మన్ కె.ఎస్. రవికుమార్ ల సమక్షంలో మహబూబ్ నగర్ కు చెందిన యువ వైద్యులు డాక్టర్ అశ్విని నవదీప్ 12వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అశ్విని నవదీప్ విద్యార్థి దశ నుంచే రక్తదానం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమన్నారు. రక్తదానం అవశ్యకతపై సంపూర్ణ అవగాన కలిగిన డాక్టర్ అశ్విని నవదీప్ ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ విద్యార్థులకు, యువకులకు డాక్టర్ అశ్విని నవదీప్ అందిస్తున్న ప్రేరణ, ప్రోత్సాహం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ అశ్విని నవదీప్ ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం రోజున 12 వ సారి రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్ ను రెడ్ క్రాస్ చైర్మన్ కె.ఎస్.రవికుమార్, వైస్ చైర్మన్ రామకృష్ణ, కోశాధికారి లయన్ జి.రమణయ్య, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ శామ్యూల్, మాజీ చైర్మన్ లయన్ నటరాజ్, రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు వి ఎస్ ఆర్ కె ప్రసాద్, హెచ్ జయరాములు,పుట్ట పాగా రఘుపతి, ధర్మ రాజు, రవికుమార్ తదితరులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.



# వేళకు పాఠశాలలు తెరవాలి



■ సీతానగరంలో పాఠశాల బయటే చిన్నారుల నిరీక్షణ

**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**హసన్‌పర్తి మండలం సీతానగరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను నిర్ణీత సమయానికి తెరవాలని గ్రామస్థులు కోరుతున్నారు. గురువారం ఉదయం 9.30 గంటల వరకు పాఠశాల తలుపులు తెరవకపోవడంతో పాఠశాలకు వచ్చిన చిన్నారులు బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు చేరుకున్నప్పటికీ సిబ్బంది సకాలంలో హాజరు కాకపోవడంతో పిల్లలు బయట నిరీక్షించాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల భద్రత, విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను ప్రతిరోజూ నిర్ణీత సమయానికి తెరిచి, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, పాఠశాలల్లో సమయపాలన పాటించేలా పర్యవేక్షణ చేపట్టాలని సీతానగరం గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# కలెక్టరేట్ చుట్టూ చెత్త కుప్పలు.. అధికారుల దృష్టికి ఎప్పుడు?



■ మూడు రోజులుగా పేరుకుపోయిన వ్యర్థాలు.. సందర్శకుల అసంతృప్తి

**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:**జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కలెక్టరేట్ చుట్టూ ఎండిపోయిన చెట్లు, కొమ్మలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో పరిసరాలు చెత్తకుప్పలను తలపిస్తున్నాయి. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాల్సిన నేపథ్యంలో జిల్లా పరిపాలనకు కేంద్రంగా ఉన్న కలెక్టరేట్ చుట్టూ చెత్త పేరుకుపోవడంపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పనిచేసే కార్యాలయం పరిసరాల్లోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.కలెక్టరేట్ పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు అధికారుల కంటికి కనిపించడంలేదా? సంబంధిత సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.వెంటనే చెత్తను తొలగించి కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గద్వాలలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**గద్వాల,జోర్దార్ ప్రతినిధి:**గద్వాల పట్టణంలోని 28 వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో గురువారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై నూతన ఇంటిని ప్రారంభించి, లబ్ధిదారులకు కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గద్వాల నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, కౌన్సిలర్ జి. చంద్రశేఖర్, విజయ్, రాజశేఖర్, రామకృష్ణ, లోకేష్ చారి, వినోద్, రవిరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

■ కలెక్టర్ రిజ్వాన్

**జోగులాంబ గద్వాల్,జోర్దార్ ప్రతినిధి:**జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన పత్రాల సేకరణ, అప్‌లోడ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపో కుండా, తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# రైస్ మిల్లర్ల ఆగ్రహం

# నాయకుల లొంగుబాటుపై తీవ్ర నిరసన

- బెదిరింపులకు తలొగ్గి సమ్మె నీరుగార్చిన సంఘాల నాయకులు
- డిమాండ్లు నెరవేరకుండానే విరమణ.. మండిపడుతున్న రైస్ మిల్లర్లు
- నాయకుల పిలుపును తిరస్కరించి యథావిధిగా మిల్లుల నిర్వహణ

**జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి / హైదరాబాద్:**

**సంక్షోభంలో మిల్ ఇండస్ట్రీ -- అభాసుపాలైన ఆందోళన**

తెలంగాణలో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైస్ మిల్ ఇండస్ట్రీ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఆందోళన చివరికి అభాసుపాలైంది. ప్రభుత్వం విధిస్తున్న వివిధ ఆంక్షలు, పెనాల్టీలు, విజిలెన్స్ దాడులపై పోరాడాల్సిన సంఘాల నాయకులు ప్రభుత్వ బెదిరింపులకు భయపడి సమ్మెను నీరుగార్చడంపై రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్లు మండిపడుతున్నారు. తమ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, వ్యక్తిగత భయాల కోసం లొంగిపోయిన ఈ నాయకుల తీరును చూసి మిల్లర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**ఏం జరిగింది? -- వివాద నేపథ్యం**

రైస్ మిల్లర్లపై ప్రభుత్వం విధిస్తున్న 25% పెనాల్టీ, 12% వడ్డీ భారం, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు తదితర అంశాలతో పాటు మిల్లింగ్, కస్టోడియన్ చార్జెస్ పెంపు కోరుతూ మిల్లర్లు కొద్ది రోజులుగా సమ్మె బాట పట్టారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పేరుతో ఒక వర్గం హడావుడిగా సమ్మె చేసి వెంటనే వెనక్కి తగ్గగా, మరోవైపు పాడి గణపతి రెడ్డి వర్గం మరియు సామాజిక కార్యకర్త రఫీ ఆధ్వర్యంలో మిల్లర్లు ఆందోళన చేపట్టారు.

**బెదిరింపులతో నీరుగారిన ఉద్యమం**

ఉద్యమం ఉధృతమవుతున్న తరుణంలో ప్రభుత్వ పెద్దల నుంచి ఈ నాయకులకు తీవ్ర బెదిరింపులు ఎదురైనట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. నాయకత్వం వహిస్తున్న వారిపై పాత కేసులు బనాయించి జైల్లో పెడతామని, వారి అవినీతి చిట్టాలన్నీ బయటపెడతామని హెచ్చరించడంతో నాయకులు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రభుత్వంతో ఎలాంటి రాతపూర్వక హామీలు పొందకుండానే, మిల్లర్ల డిమాండ్లను గాలికొదిలేసి అర్ధాంతరంగా సమ్మెను విరమించారు.

**గొప్పలు చెబుతున్న నాయకులు.. మండిపడుతున్న మిల్లర్లు**

సమ్మె విరమణ అనంతరం సదరు నాయకులు మీడియా ముందుకు వచ్చి, "ప్రభుత్వంతో చర్చలు విజయవంతమయ్యాయని, మంత్రిగారు మా డిమాండ్లను అంగీకరించారని" గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా మారిందని మిల్లర్లు వాపోతున్నారు. ప్రభుత్వం కనీసం ఒక్క డిమాండ్‌ను కూడా అధికారికంగా అంగీకరించకపోయినా, వీరు పల్లవి మార్చడం ద్రోహం కిందకే వస్తుందని మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాయకుల పిలుపుకు స్పందనేది? -- యథావిధిగా మిల్లుల నిర్వహణ**

నాయకులపై నమ్మకం సడలిపోవడంతో వారు పిలుపునిచ్చిన 'మిల్లు బంద్'ను క్షేత్రస్థాయిలో మిల్లర్లు పూర్తిగా తిరస్కరించారు. నాయకుల మాటలకు విలువ లేకుండా పోవడంతో, మిల్లర్లంతా ఎక్కడికక్కడ యథావిధిగా తమ మిల్లులను నడిపించారు. స్వార్థపూరిత నాయకత్వం వల్లనే రైస్ మిల్ ఇండస్ట్రీ సమస్యలు అటకెక్కాయని, ఇలాంటి నాయకులు తమకు వద్దంటూ మిల్లర్లు తీవ్రంగా తప్పుపడుతున్నారు.

# ప్రభుత్వ భూమిలో

# భవనాల నిర్మాణం చేపట్టొద్దు

- తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తున్న 300 గౌడ కుటుంబాల వినతి



**జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి:**మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం చేపట్టవద్దని కోరుతూ ఇల్లంతకుంటకు చెందిన గౌడ కులస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు మాట్లాడుతూ.. గత సుమారు వంద సంవత్సరాలుగా తమ జీవనోపాధి తాటి చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలోని భూమిలో తాటి చెట్లను పెంచుకుంటూ, కల్లు గీసుకుంటూ సుమారు 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం అదే భూమిలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తమకు తెలిసిందన్నారు. తాటి చెట్లను తొలగించి ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే తమ సంప్రదాయ జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాల జీవనాధారంగా ఉన్న తాటి చెట్లను కాపాడాలని, సంబంధిత భూమిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరుతూ గౌడ కులస్తులంతా ఏకమై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

తమ జీవనోపాధికి నష్టం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మంత్రి పొంగులేటి చదివిన

# కాలేజీలో సిబ్బంది కొరత!

- స్వీపర్, స్కావెంజర్, అటెండర్ లేక విద్యార్థుల అవస్థలు
- మరుగుదొడ్ల నిర్వహణ నుంచి పరిపాలనా పనుల వరకు ఇబ్బందులు



**ఖమ్మం జోర్దార్ ప్రతినిధి:**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చదువుకున్న కల్లూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది కొరతతో సమస్యలను ఎదుర్కొంటోంది. చాలా కాలంగా స్వీపర్, స్కావెంజర్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. స్వీపర్ లేకపోవడంతో తరగతి గదులు, కళాశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణకు ఆటంకం ఏర్పడుతోందని విద్యార్థులు చెబుతున్నారు. మరోవైపు స్కావెంజర్ లేకపోవడంతో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, దీంతో ముఖ్యంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. అటెండర్ పోస్టు ఖాళీగా ఉండటంతో కళాశాలలో రోజువారీ పరిపాలనా, ఇతర సహాయక పనుల నిర్వహణకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధ్యాపకులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన కళాశాలలో కనీస సిబ్బంది లేకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చదువుకున్న కళాశాలలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవసరమైన పారిశుధ్య, మౌలిక వసతులను కల్పించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. మంత్రి ప్రత్యేక దృష్టి సారించి కళాశాల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన

# ప్రొఫెసర్ కృష్ణవేణికి ఘన సన్మానం

- బెస్ట్ టీచర్, నేషన్ బిల్డర్ అవార్డులు ప్రదానం చేసిన రోటరీ క్లబ్ వరంగల్



**వరంగల్ జోర్దార్ ప్రతినిధి:**కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆచార్య జానపా రెడ్డి కృష్ణవేణికి రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్, నేషన్ బిల్డర్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. ఆచార్య జానపా రెడ్డి కృష్ణవేణి తండ్రి దివంగత చక్రపాణి ఫిజిక్స్ డిగ్రీ లెక్చరర్‌గా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఆయన స్ఫూర్తితో కృష్ణవేణి విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణవేణి కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలోనే బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ విద్యను పూర్తి చేసి, 1997 డిసెంబర్ 10న తాళ్ల పద్మావతి కాలేజీ ఫార్మసీ విభాగంలో ప్రిన్సిపాల్‌గా వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఆచార్యురాలిగా సేవలందిస్తూ బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ విద్యార్థులకు బోధనతో పాటు మార్గదర్శకత్వం అందిస్తున్నారని వివరించారు. ఆమె పర్యవేక్షణలో ఇప్పటివరకు ఐదుగురు విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాలు పొందగా, మరో నలుగురు పరిశోధనలు కొనసాగిస్తున్నారని తెలిపారు. సుమారు 100 మందికి పైగా ఎం.ఫార్మసీ విద్యార్థులకు పరిశోధనలో మార్గదర్శకత్వం వహించారని, జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో సుమారు 50 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. ఆచార్య కృష్ణవేణి పరిశోధనా రంగం ప్రధానంగా నానోటెక్నాలజీ ఫార్ములేషన్స్, నాసల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్, బుక్కల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ చుట్టూ కొనసాగుతోందని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే ఔషధ పరిశోధనలపై ఆమె విస్తృతంగా పనిచేస్తున్నారని వివరించారు. అమెరికాలో సీవీ రామన్ ఫెలోషిప్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీలో గతంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా, హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా, హెల్త్ సెంటర్ ఇన్‌చార్జిగా కూడా ఆమె సేవలందించారని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అవార్డులు అందుకున్న సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సీనియర్ ఆచార్యులు వై. నరసింహారెడ్డి, గాదె సమ్మయ్య, సునీత, ప్రియాంక, పరిశోధకులు, విద్యార్థులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

భవిష్యత్తులో మరెన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

# మానకొండూరు విశాల సహకార పరపతి సంఘంలో నిధుల కుంభకోణం

- మాజీ చైర్మన్ రామిడి తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- పీఐసీ కమిటీ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై తీవ్ర ఆరోపణలు
- తప్పుడు బిల్లులు, అక్రమ నిర్మాణాలు, అవినీతిపై సమగ్ర విచారణకు డిమాండ్

**(కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండల విశాల సహకార పరపతి సంఘంలో నామినేటెడ్ పద్ధతిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పీఐసీ కమిటీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేస్తూ, పలు అక్రమాలకు పాల్పడుతోందని సంఘ మాజీ చైర్మన్ రామిడి తిరుపతి ఆరోపిస్తు. ఈ మేరకు ఆయన కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

**తప్పుడు బిల్లులతో నిధుల స్వాహా యత్నం** పీఐసీ కమిటీ బాధ్యతలు చేపట్టిన వెంటనే, సర్వసభ్య సమావేశం ముందస్తు తీర్మానం లేదా ఆమోదం లేకుండా రూ. 1 లక్ష నుండి రూ. 1.5 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేసి , దానికి విరుద్ధంగా దాదాపు రూ. 4 లక్షలకు పైగా బిల్లులు సృష్టించి ఆ మొత్తాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ చెల్లింపుల కోసం అత్యవసర సమావేశాల పేరుతో తప్పుడు తీర్మానాలు రచిస్తూ నిధులు విత్ డ్రా చేసుకోవడానికి కుట్ర పన్నుతున్నట్లు పేర్కొన్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా అనవసర నిర్మాణాలు:** సహకార సంఘ పరిధిలోని భవనాన్ని కేడీసీసీ బ్యాంకుకు అద్దెకు ఇవ్వడం జరిగిందని, అయితే సర్వసభ్య సమావేశం గానీ, జిల్లా సహకార అధికారి అనుమతి గానీ లేకుండా, ఎలాంటి ఉపయోగం లేని ఆ భవనంపైన మొదటి అంతస్తు నిర్మించడానికి సంఘం నిధులను ఖర్చు చేయాలని చూస్తున్నారని తెలిపారు.

కేవలం కమీషన్ కక్కుర్తి కోసమే పీఐసీ కమిటీ ఇలాంటి అనవసర పనులకు పాల్పడుతోందని విమర్శించారు.

ఫెర్టిలైజర్ సప్లై ఏజెన్సీ బకాయిల సమస్య సహకార సంఘానికి ఎరువులు సప్లై చేసిన సంబంధిత ఏజెన్సీకి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని, దీని వల్ల సంఘం యొక్క వ్యాపార మరియు ఆర్థిక లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.

సీఈఓ నియామకం మరియు నిధుల రక్షణ ఈ సంఘం యొక్క సీఈఓ లక్ష్మారెడ్డిని సస్పెండ్ చేయడం జరిగిందని, ఆ తర్వాత ఆ స్థానంలో మరో ఉద్యోగికి సీఈఓ బాధ్యతలు అప్పజెప్పగా, అతను ఆ బాధ్యతలు చేపట్టడానికి నిరాకరిస్తూ లేఖ ఇచ్చి తప్పుకున్నారని తెలిపారు. ప్రస్తుతం తప్పుడు పనుల ద్వారా సంఘంలో ఉన్న డబ్బులను అక్రమంగా డ్రా చేయకుండా కట్టడి చేయాలని, ముఖ్యంగా పీఓపీ పనులకు సంబంధించిన మిగతా బిల్లుల చెల్లింపులను వెంటనే నిలిపివేయాలని కోరారు.

కావున, పై విషయాలన్నింటినీ తీవ్రంగా పరిగణలోకి తీసుకుని, మానకొండూరు విశాల సహకార పరపతి సంఘం పీఐసీ కమిటీ చేస్తున్న అక్రమాలను అడ్డుకోవాలని, సంఘ సంపదను కాపాడాలని మరియు అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా సహకార అధికారి గారిని ఆదేశించాలని వారు కలెక్టర్ ని కోరారు.

# ఘనంగా ఎమ్మెల్సీమల్కా కొమురయ్య

# జన్మదిన వేడుకలు



**పెద్దపెల్లి జోర్దార్ ప్రతినిధి:**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య జన్మదిన వేడుకలు బిజెపి ఆధ్వర్యంలో జూలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంతం నుండి బీసీ బిడ్డ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం మన ప్రాంతానికి గర్వకారణమని, ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యల పట్ల పోరడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇంకా వారు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి మండల ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొమ్మా ఐలయ్య, పెద్దల ఐలయ్య, దొడ్ల రాజయ్య, కొమ్మ సతీష్, కొల్లూరి స్వామి, మెరుగు కనకయ్య, సాంబారి శ్రీనివాస్,అమరగాని ఎల్లేష్, సది తదితరులు పాల్గొన్నారు..

# 43 ఏళ్ల జానపద సేవకు అరుదైన గౌరవం



**హైదరాబాద్,జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ జానపద కళల అభివృద్ధి, పరిరక్షణకు 43 ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్న కరీంనగర్ జానపద కళల అకాడమీ అధ్యక్షుడు గుండ్ర కృపాదానంకు అరుదైన గౌరవం లభించింది. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రదానం చేసి ఘనంగాసత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ హాజరై కృపాదానంకు అవార్డు అందజేశారు. తెలంగాణ జానపద కళలు, కళాకారుల అభ్యున్నతి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్నారు. 43 ఏళ్ల ఆయన కళా సేవలను గుర్తించి అవార్డు అందించడం పట్ల జానపద కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ దాండియా వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: డాక్టర్ వి. నరేందర్ రెడ్డి
- విద్యార్థులు, తల్లిదండ్రుల సందడితో పండుగ వాతావరణం



**కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, దాండియా వేడుకలను కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ వి. వనజా నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మను పూజించడం అంటే ప్రకృతిని ఆరాధించడమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. పల్లెల్లో ఇప్పటికీ బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయని, బతుకమ్మ పాటలు, కోలాటాలు తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. రంగురంగుల స్థానిక పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. అనంతరం వివిధ ఆకర్షణీయమైన పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా దాండియా నృత్యాలు చేశారు. తల్లిదండ్రులు సైతం కోలాటాలతో పాల్గొని వేడుకలకు మరింత వన్నె తెచ్చారు. విద్యుత్ కాంతుల మధ్య విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన 'ఆకాశంలో ఆశల హరివిల్లు', 'రమణి బిందాల', 'ఓరుగల్లు పిల్ల', 'కమ్మని నీ ప్రేమలేఖలే', 'జామురాత్రి', 'అందమైన ప్రేమరాణి', 'మాటే రాని చిన్నదాని' తదితర నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం


# తల్లి, బిడ్డ మృతిపై
## సమగ్ర విచారణ జరపాలి

- బాలమణి కుటుంబానికి 25 లక్షల పరిహారం ఇవ్వాలి
- "బీసీ సంఘం జాతీయ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్



**వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:**తాండూరు నియోజకవర్గం జినుగుర్తి గ్రామానికి చెందిన బాలమణి ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా తల్లి, బిడ్డ మృతి చెందిన ఘటనపై బీసీ సంఘం జాతీయ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి, బిడ్డల మృతికి కారణమైన వైద్య సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాలమణి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని కోరారు. అనంతరం జినుగుర్తి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన కందుకూరి రాజ్‌కుమార్, అంత్యక్రియల్లో స్వయంగా పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగకు
## చెరువు ప్రాంగణం సిద్ధం చేయాలి



**కాజీపేట,జోర్దార్ ప్రతినిధి:**సద్దుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని బంధం చెరువు కట్టను శుభ్రం చేసి, బతుకమ్మలు ఆడుకునే ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని కోరుతూ దర్గా సద్దుల బతుకమ్మ ఉత్సవాల కమిటీ సభ్యులు గురువారం హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆడపడుచుల పండుగైన సద్దుల బతుకమ్మను బంధం చెరువు కట్టపై అంగరంగ వైభవంగా నిర్వహించిన అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం చెరువులో నీరు కలుషితంగా ఉండటంతో పాటు ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాల తయారీకి ఉపయోగించిన ఫ్రేములు, కర్రలు, ఇనుపరాట్లు తదితర వ్యర్థాలు అక్కడే ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మత్తడి వద్ద నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తే బతుకమ్మలు ఆడుకునే ప్రాంగణంలోకి నీరు చేరుతుందని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, రాధాకృష్ణ, అంకేశ్వరపు రామచందర్‌రావు,విజయ్, రవీందర్, రాజు,కుమార్, రవిప్రసాద్,శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మైన్స్ రెస్క్యూ పోటీల్లో ఆర్జీ-2/3
## ఏపీఏ జట్టు ఘన విజయం



- ఓవరాల్ ప్రథమ బహుమతి కైవసం.. మూడు విభాగాల్లో సత్తా

**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో ఆర్జీ-2/3, ఏపీఏ జట్టు సత్తా చాటింది. ఓవరాల్‌లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకోవడంతో పాటు రెస్క్యూ రికవరీ, థియరీ విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. రెస్క్యూ రిలేలో ద్వితీయ బహుమతి సాధించింది.కె. శ్రీకాంత్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టులో ఎస్కే ముదాసిర్ అలీ, చ. సతీష్, ఎం. పుల్లయ్య, చ. విజ్ఞాన్, బి. తిరుపతి, ఎస్. శివకుమార్ పాల్గొన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్కే ముదాసిర్ అలీని బెస్ట్ మెంబర్గా ఎంపిక చేశారు.జట్టు సాధించిన విజయంపై అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. రెస్క్యూ సిబ్బంది ప్రతిభను ప్రశంసిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# తెలంగాణలోప్రిన్సిపాల్స్ పై
## నకిలీ జూనియర్ అధ్యాపకుల దురుసు ప్రవర్తన

- నకిలీలని తేలినా ప్రతి నెల 1వ తేదీన దర్జాగా జీతాలు
- ప్రజాధనం వృథా అవుతున్నా చోద్యం చూస్తున్న ఇంటర్ విద్యాధికారులు

**(హైదరాబాద్ జోర్దార్ విద్య ప్రతినిధి:)**తెలంగాణ ఇంటర్ విద్యాశాఖలో 2023 మే 4న జరిగిన కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఇప్పుడు కళాశాలల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందారంటూ పలువురిపై అధికారులు నోటీసులు జారీ చేయగా, వారు తమను ప్రశ్నించిన ప్రిన్సిపాల్స్ పైనే దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయి.

**నోటీసులు అందుకున్నా తగ్గని దూకుడు**

ఇంటర్ విద్యాశాఖ అధికారులు పలువురు అధ్యాపకుల జెన్యూనిటీపై అనుమానాలు వ్యక్తం చేస్తూ నోటీసులు ఇచ్చారు. అయితే తాము నకిలీలం కాదంటూ ఆ అభ్యర్థులు ప్రిన్సిపాల్స్‌తో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. దీంతో కళాశాలల్లో పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి.

**జిల్లాల వారీగా వెలుగులోకి వచ్చిన ఘటనలు**

**హనుమకొండ:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్ కుమార్ అనే అధ్యాపకుడు పలు వివాదాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో అధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు, తొలగింపు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**జఫర్ గఢ్:** ఇక్కడ ఇంగ్లీషు బోధిస్తున్న సూర్యనారాయణ అనే అధ్యాపకుడికి నకిలీ అంటూ నోటీసులు ఇచ్చారు. గత పది రోజుల క్రితం ఈ అధ్యాపకుడు మద్యం సేవించి కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను, విద్యార్థులను దుర్భాషలాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రిన్సిపాల్ ఆర్జేడీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని చెబుతున్నారు.

**చేర్యాల (సిద్దిపేట జిల్లా):** మ్యాథ్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ల్యాగల పరశురాములు నకిలీ అంటూ నోటీసులు అందుకున్నారు. తనకు మరో పీజీ ఉందని, దానిని పరిగణలోకి తీసుకోవాలని కోరగా ప్రిన్సిపాల్ నిరాకరించారు. దీంతో ప్రిన్సిపాల్ పేరిట నకిలీ లేఖ సృష్టించి, డీడీ తీసి యూనివర్సిటీకి దొంగతనంగా పోస్ట్ చేశారనే తీవ్ర ఆరోపణ ఉంది. దీనిపై ప్రిన్సిపాల్ రెండు పేజీల లేఖతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**వైరా (ఖమ్మం జిల్లా):** హిందీ అధ్యాపకురాలు రోషన్ బి ప్రిన్సిపాల్ తో వాగ్వాదానికి దిగారని, అధికారులే తమ పరిస్థితికి కారణమంటూ సూసైడ్ లెటర్ రాసి చనిపోతామని ప్రిన్సిపాల్‌ను, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని బెదిరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**గజ్వేల్ (సిద్దిపేట జిల్లా):** అష్రఫ్ హుస్సేన్ అనే అధ్యాపకుడు తమను ఎవరూ తొలగించలేరని, సంఘం నాయకుల అండదండలు ఉన్నాయని ప్రిన్సిపాల్‌తో దురుసుగా మాట్లాడినట్లు తెలుస్తోంది.

**ఆర్జేడీ తీరుపై విమర్శలు**

వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఇన్ ఛార్జి ఆర్జేడీ గోపాల్ నాయక్ కు ప్రతి విషయంపై ఫిర్యాదులు అందుతున్నా, చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజాధనం వృథా.. జీతాల చెల్లింపుపై ప్రశ్నలు**

ఒకవైపు చిన్న ఉద్యోగులకు జీతాలు అందక ఆర్థిక శాఖ ముందు ఆందోళనలు జరుగుతుంటే, నకిలీలని అనుమానిస్తున్న అధ్యాపకులకు గత రెండు నెలలుగా జీతాలు చెల్లించడంపై విమర్శలు వస్తున్నాయి. నోటీసులు ఇచ్చి, సస్పెన్షన్ ఆర్డర్లు ఇచ్చిన వారికి కూడా రెండో నెల జీతం చెల్లించడం ప్రజాధనం వృథా చేయడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యావర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

# బీసీ సంక్షేమ శాఖ ప్రమోషన్లపై కలకలం!

- విచారణల్లో ఉన్న అధికారులకూ పదోన్నతులా?
- పోస్టింగులపై 'సీటుకో రేటు' ఆరోపణలు.. పూర్తిస్థాయి విచారణకు ఉద్యోగ సంఘాల డిమాండ్

**(జోర్దార్, హైదరాబాద్)**బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల చేపట్టిన ఉన్నతస్థాయి పదోన్నతుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రమోషన్ల ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని, గతంలో విచారణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారులకు సైతం పదోన్నతులు కల్పించారని ఉద్యోగవర్గాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా కీలక పోస్టులకు పోస్టింగులు ఇచ్చే విషయంలో 'సీటుకో రేటు' అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొంటున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ఆరు డీడీ పోస్టులు ఖాళీ**

బీసీ సంక్షేమ శాఖలో ప్రస్తుతం ఆరు డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. హనుమకొండ, కరీంనగర్, వెలుగొండ తదితర ప్రాంతాలతోపాటు గురుకుల సొసైటీలో డిప్యూటీ సెక్రటరీ పోస్టులు రెండు, బీసీ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్ (జీఎం) పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. వీటి భర్తీకి సంబంధించి ఇటీవల డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది.

**విచారణలు కొనసాగుతుండగానే ప్రమోషన్లా?**

ప్రమోషన్లకు ఎంపికైన కొందరు అధికారులపై గతంలోనే వివిధ అంశాల్లో విచారణలు కొనసాగుతున్నాయని ఉద్యోగవర్గాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా ఒక అధికారికి ఎస్సీ కుల ధ్రువీకరణకు సంబంధించిన అంశంపై గతంలో విచారణ కొనసాగుతుండగా, ఆ వ్యవహారం పూర్తి కాకముందే పదోన్నతి కల్పించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత విచారణ నివేదికలు, అధికారిక ఫైల్ నోటింగ్స్‌ను పూర్తిగా పరిశీలించకుండా నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరో అధికారిపై పరిపాలనా వ్యవహారాలు, ప్రోటోకాల్, విధులకు గైర్హాజరు తదితర అంశాలకు సంబంధించి క్రమశిక్షణా చర్యలు, విచారణలు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రమోషన్ ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఆడిట్ నివేదికలపై ప్రశ్నలు**

హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల చెల్లింపులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, విదేశీ విద్యా పథకం తదితర అంశాల్లో అవకతవకలకు సంబంధించిన ఫిర్యాదులు, ఆడిట్ నివేదికలు ఉన్నాయని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. ఆయా అంశాలపై పూర్తి స్థాయి విచారణ, నివేదికలు వెలువడకముందే కొందరికి పదోన్నతులు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**పోస్టింగులపైనా అనుమానాలు**

పదోన్నతులతోపాటు కీలక పోస్టింగుల విషయంలోనూ ముందుగానే పేర్లు ఖరారయ్యాయని, కొందరి కోసం కార్యాలయాల్లో చాంబర్లు సైతం సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీసీ కార్పొరేషన్‌లోని జనరల్ మేనేజర్ పోస్టుకు ఒకరిని ముందుగానే ఎంపిక చేశారని ఉద్యోగవర్గాలు పేర్కొంటున్నాయి.

పోస్టింగ్ ఉత్తర్వులు వెలువడకముందే కొందరు అధికారుల పేర్లు బహిరంగంగా చర్చకు రావడం అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు.

**మంత్రి పేషీకి చేరిన ఫైల్**

ప్రమోషన్లు, పోస్టింగులకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేషీకి చేరినట్లు ఉద్యోగవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందనే సమాచారం నేపథ్యంలో ఉద్యోగుల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

**ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

ప్రమోషన్లు పొందిన అధికారులపై గతంలో నమోదైన విచారణలు ఏమయ్యాయి? వాటిపై తీసుకున్న చర్యలేమిటి? విదేశీ విద్య, హాస్టళ్ల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు సంబంధించి ఆడిట్ నివేదికల్లో ఏం పేర్కొన్నారు? విచారణలు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగానే కీలక బాధ్యతలు అప్పగించడానికి కారణమేంటి? అనే ప్రశ్నలను ఉద్యోగవర్గాలు లేవనెత్తుతున్నాయి.

ఈ ఆరోపణలపై బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు అధికారికంగా స్పందించి వాస్తవాలను వెల్లడించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. పూర్తి స్థాయి విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత పోస్టింగులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

# హుజురాబాద్‌లో
## బొడ్డెమ్మ వేడుకలు



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పట్టణంలో బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భాద్రపద మాసంలో మహిళలు తొమ్మిది రోజులపాటు ఈ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పుట్టమట్టితో బొడ్డెమ్మను తయారు చేసి పీటపై వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం బొడ్డెమ్మ చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.

ప్రతి ఏడాది నిర్వహించే ఈ సంప్రదాయ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బొడ్డెమ్మ వేడుకలను కొనసాగిస్తూ సంప్రదాయాన్ని కాపాడుతున్న మహిళలను పలువురు అభినందించారు.

# కృష్ణసాగర్ పంచాయతీలో
## స్వచ్ఛ భారత్



**బూర్గంపహాడ్:** బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీలో ఐటీసీ వాష్, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచులు గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ తాటి వాణి, ఉప సర్పంచ్ భూక్యా మోహనరావు ఐటీసీ వాష్, ఐటీసీ ఎనీవోల ప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి శ్రమధానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. వీబీజీ రామ్ జీ ఆధ్వర్యంలో మ్యాప్‌ను రూపొందించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్యం, పరిసరాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీలో సేవలందిస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్లను శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో ఐటీసీ వాష్, ఐటీసీ ఎన్జీవోల ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి నాగిరెడ్డి, ఎంపీడబ్ల్యు వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శుక్రవారం,
అక్టోబర్ 02 2026



# సీఎం రేవంత్ రెడ్డి జర దేఖో

■ **ఫార్మర్ రిజిస్ట్రీ కోసం మీ-సేవా.. సీఎస్సీ.. ఏఈవో కార్యాలయాల చుట్టూ రైతుల పరుగులు!**

**(జోర్దార్ హైదరాబాద్-అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)**రైతుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ ఇప్పుడు రైతులకే కొత్త తలనొప్పిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ వివరాలు నమోదు చేయించుకునేందుకు రైతులు మీ-సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీలు), ఏఈవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల కోసం రూపొందించిన రిజిస్ట్రీ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన సమయంలో.. రైతు తన మొబైల్ నుంచే స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఎందుకు కల్పించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కేంద్రం నుంచి వచ్చే నజరానాలపైనే దృష్టా?**

రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు..

కేంద్రం నుంచి వచ్చే నిధులు, ప్రోత్సాహకాలపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

**పథకాలన్నింటికీ కీలకమే!**

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదయ్యే వివరాలు భవిష్యత్తులో పలు వ్యవసాయ సేవలు, సంక్షేమ పథకాలతో అనుసంధానం కానున్న నేపథ్యంలో.. ప్రతి అర్హత కలిగిన రైతు తన వివరాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

పంట కొనుగోళ్లు, ఎరువుల సరఫరా, పంట రుణాలు, పీఎం కిసాన్ తదితర సేవలు, పథకాల అమలులో రైతుల వివరాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో.. రిజిస్ట్రీపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు.

**రైతుల ఇక్కట్లపై ప్రశ్నిస్తే.. స్పందనేదీ?**

రైతుల సమస్యలపై వివరణ కోరిన సమయంలో జోర్దార్‌కు ముఖం చాటేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది

రైతు కోసం తీసుకొచ్చిన వ్యవస్థలో రైతే ఇబ్బంది పడుతున్న పరిస్థితి మారాలని.. కార్యాలయాల చుట్టూ తిప్పే విధానం కాకుండా, రైతు ఇంటి నుంచే సేవలు పొందేలా ఫార్మర్ రిజిస్ట్రీని సులభతరం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# తరచూ తలనొప్పి వస్తుందా..

# కారణాలేంటి.. ఏం చేయాలి..?

తలనొప్పి వచ్చినప్పుడు చాలామంది ఒత్తిడి, ఎక్కువసేపు తెరలను చూడడం లేదా నిద్రలేమి వంటి కారణాలను అనుకుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో తలనొప్పికి కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా కారణం అవుతాయి. కంటి చూపు సరిగా లేకపోవడం, కళ్లపై అధిక ఒత్తిడి పడడం, ఎక్కువసేపు కంప్యూటర్ లేదా ఫోన్ చూడడం వల్ల నుదురు ప్రాంతంలో నొప్పి, కంటి అలసట వంటి సమస్యలు వస్తాయి. మయోపియా, హైపరోపియా లేదా ఆస్టిగ్మాటిజం వంటి చూపు సమస్యలు ఉన్నప్పుడు స్పష్టంగా చూడడానికి కంటి కండరాలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో లేదా ఎక్కువసేపు దగ్గరి పనులు చేసిన తర్వాత తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు తెరలను చూడడం వల్ల రెప్పలు తక్కువగా కొట్టుకోవడం, కళ్లలో పొడిబారడం, కంటి కేంద్రీకరణ కండరాలు ఒకే స్థితిలో ఉండడం కూడా ఒత్తిడిని పెంచుతాయి.



**దగ్గరి వస్తువులను తదేకంగా చూస్తే..**

దగ్గరి వస్తువులను చూడడంలో రెండు కళ్ల సమన్వయం సరిగా లేకపోయినా తలనొప్పి వస్తుంది. చదవడం లేదా తెరలను చూడడం మొదలుపెట్టిన తర్వాత తలనొప్పి క్రమంగా పెరగడం, అక్షరాలు కదులుతున్నట్లు లేదా రెండుగా కనిపించడం, ఒక కన్ను మూసుకుని చదివితే సౌకర్యంగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటే కళ్ల సమన్వయానికి సంబంధించిన సమస్య ఉండే అవకాశం ఉంది. అలాగే తలనొప్పికి ముందు మెరుస్తున్న కాంతులు, జిగ్‌జాగ్ గీతలు లేదా కొంతసేపు చూపు కనిపించకపోవడం వంటివి కనిపిస్తే అది సాధారణంగా కంటి వ్యాధి కాకుండా దృశ్య ప్రకాశంతో కూడిన మైగ్రేన్‌కు సంబంధించిన నాడీ వ్యవస్థ లక్షణం అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా ఈ లక్షణాలు రెండు కళ్లలోనూ కనిపించి 20 నుంచి 30 నిమిషాల్లో తగ్గిపోతాయి.

**ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..**

అయితే కొన్ని లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఒక కంటిలో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, కళ్లు ఎర్రబడడం, చూపు మసకబారడం, కాంతుల చుట్టూ వలయాలు కనిపించడం, వికారం లేదా వాంతులు ఉంటే తీవ్రమైన గ్లాకోమా వంటి అత్యవసర పరిస్థితి అయ్యే వీలు ఉంది. కంటి కదలికతో నొప్పి రావడం, ఆ తర్వాత ఒక కంటిలో చూపు తగ్గడం లేదా రంగులు వెలిసినట్లు కనిపించడం ఆప్టిక్ న్యూరైటిస్‌కు సంకేతం అవుతుంది. తలలో ఒత్తిడి పెరగడం వల్ల ఆప్టిక్ నాడిలో వాపు ఏర్పడినప్పుడు ఉదయం లేచిన వెంటనే లేదా నిద్రించినప్పుడు తలనొప్పి ఎక్కువగా ఉండడం, దగ్గినప్పుడు లేదా ఒత్తిడి పెట్టినప్పుడు నొప్పి పెరగడం, నిలబడినప్పుడు కొద్దిసేపు చూపు మసకబారడం, చెవుల్లో శబ్దం వినిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్య పరీక్ష అవసరం.

**50 ఏళ్ల తరువాత వస్తే..**

50 ఏళ్ల తర్వాత మొదటిసారి తలనొప్పి రావడం, తల చర్మం తాకినా నొప్పిగా అనిపించడం లేదా నమిలేటప్పుడు దవడ నొప్పి రావడం వంటి లక్షణాలు కూడా అత్యవసరంగా పరీక్షించాల్సినవే. సైనస్ వాపు వల్ల కళ్ల చుట్టూ నొప్పి, ముఖ్యంగా ముందుకు వంగినప్పుడు ఎక్కువయ్యే నొప్పి కూడా వస్తుంది. కళ్లు పొడిబారడం, కనురెప్పల అంచుల్లో వాపు వంటి సమస్యలు కూడా కంటి ఒత్తిడిని పెంచుతాయి. తరచూ తలనొప్పి వస్తుంటే కంటి చూపును పరీక్షించుకోవడం, దగ్గరి పనుల సమయంలో కళ్ల సమన్వయం, కేంద్రీకరణను పరీక్షించుకోవడం, 20-20-20 నియమాన్ని పాటించడం, తరచూ రెప్పలు కొట్టడం, తెరను సరైన దూరంలో ఉంచడం వంటి జాగ్రత్తలు ఉపయోగపడతాయి.

సాధారణ తలనొప్పి విశ్రాంతితో తగ్గిపోయే అవకాశం ఉన్నప్పటికీ, ఎప్పటిలా కాకుండా కొత్తగా లేదా భిన్నంగా అనిపించే తలనొప్పి, చూపులో మార్పులు, కంటి నొప్పి వంటి లక్షణాలు ఉంటే కేవలం నొప్పి నివారణ మందులు వేసుకోకుండా వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు

# బాలికల్లో సక్రమంగా లేని రుతుక్రమం..

# ఎయిమ్స్ సర్వేలో వెల్లడి..

బాలికల్లో రుతుక్రమం సక్రమంగా లేకపోవడం ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తున్న సమస్యగా మారుతోంది. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నిర్వహించిన సర్వేలో ప్రతి ఐదుగురు పాఠశాల బాలికల్లో ఒకరికి రుతుక్రమం సక్రమంగా ఉండడం లేదని వెల్లడైంది. అయితే రుతుక్రమంలో మార్పులు కనిపించిన ప్రతిసారీ దానిని పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్)గా భావించకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ముఖ్యంగా రుతుస్రావం ప్రారంభమైన తొలి సంవత్సరాల్లో హార్మోన్లలో సహజంగా వచ్చే మార్పుల కారణంగా కొంతకాలం రుతుక్రమం సక్రమంగా లేకపోవడం సాధారణమేనని చెబుతున్నారు.

బాలిక వయస్సు, మొదటి రుతుస్రావం వచ్చినప్పటి నుంచి గడిచిన సమయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సమస్యను అంచనా వేయాలని సూచిస్తున్నారు.



**తక్కువగా లేదా ఎక్కువగా ఉన్నా..**

రుతుస్రావాల మధ్య వ్యవధి 21 రోజుల కంటే తక్కువగా ఉండడం, 35 రోజుల కంటే ఎక్కువగా ఉండడం లేదా వరుసగా మూడు నెలల పాటు రుతుస్రావం రాకపోవడం వంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. రుతుక్రమం సక్రమంగా లేకపోవడం ఒక్కటే పీసీఓఎస్ నిర్ధారణకు సరిపోదని స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన మొటిమలు, ముఖం లేదా శరీరంపై అధికంగా వెంట్రుకలు పెరగడం వంటి పురుష హార్మోన్ల అధిక ప్రభావానికి సంబంధించిన లక్షణాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా కూడా రుతుక్రమంలో మార్పులు వస్తాయని, అందువల్ల సరైన కారణాన్ని గుర్తించడం ముఖ్యమని చెబుతున్నారు.

**పరీక్షల్లో లక్షణాలు ఉంటే..**

అలాగే అల్ట్రాసౌండ్ పరీక్షలో అండాశయాల్లో పాలిసిస్టిక్ లక్షణాలు కనిపించినంత మాత్రాన బాలికకు పీసీఓఎస్ ఉన్నట్లు నిర్ధారించలేమని నిపుణులు పేర్కొంటున్నారు. రుతుక్రమంలో కొనసాగుతున్న అసమానతలు, పురుష హార్మోన్ల అధిక ప్రభావానికి సంబంధించిన లక్షణాలు, ఇతర కారణాలు వంటి అనేక అంశాలను కలిపి పరిశీలించిన తర్వాతే నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. ఎయిమ్స్ నిర్వహిస్తున్న ఈ సర్వే 2023 నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆరు నుంచి ఏడు పాఠశాలల్లో సుమారు 4వేల మంది బాలికలను సర్వేలో భాగంగా పరిశీలించారు. ఈ వివరాల ఆధారంగా బాలికల్లో పీసీఓఎస్ ఎంతమందికి ఉందో కచ్చితంగా చెప్పడం ఇంకా సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు.

**ఇతర సమస్యలకు దారి తీసే అవకాశం..**

పీసీఓఎస్ ఉన్నప్పుడు సమస్యలు కేవలం రుతుక్రమానికే పరిమితం కాకుండా భవిష్యత్తులో ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం, టైప్-2 మధుమేహం, ఫ్యాటీ లివర్ వ్యాధి, రక్తంలోని కొవ్వుల అసమతుల్యత వంటి ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. కొంత మంది బాలికల్లో ఆందోళన, నిరాశ, ఆహారపు అలవాట్లలో సమస్యలు, శరీర ఆకృతిపై ఒత్తిడి వంటి మానసిక సమస్యలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి సందర్భంలోనూ మందులు అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, ప్రొటీన్లు, పండ్లు, కూరగాయలు సమృద్ధిగా ఉండే సమతుల ఆహారం తీసుకోవడం, ఎత్తు, బరువు, ముఖ్యంగా వేగంగా పెరుగుతున్న బరువును పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్తులో జీవక్రియ సంబంధిత సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు

# హనుమకొండ ప్రిన్సిపాల్ గిరి కోసం

# భారీ పైరవీలు

■ **హనుమకొండ ప్రిన్సిపాల్ పోస్ట్ కోసం అడ్డదారుల్లో లక్షలు సమర్పిస్తున్నారనే ఆరోపణలు**

■ **ఇంటర్ పరీక్ష కేంద్రంలో ఏటా రూ.10 లక్షల ఆదాయం కోసమే పైరవీల జోరు?**

**(హైదరాబాద్,/ వరంగల్ జోర్దార్ ప్రతినిధి:)** హనుమకొండ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పోస్ట్ దక్కితే ఏటా రూ.15 నుంచి 20 లక్షల వరకు సంపాదించవచ్చనే ప్రచారం సాగుతుండటంతో ఆ పోస్ట్ కోసం అభ్యర్థులు పోటీ పడుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విదేశీ యాత్ర, లాంగ్ లీవ్ పేరిట సెలవులు పెట్టి, ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయంలో పైరవీలు చేసి హనుమకొండ ప్రిన్సిపాల్ గా రావడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ పోస్ట్ కోసం రూ.20 లక్షల వరకు రేటు పలుకుతోందనే ప్రచారం జరుగుతోందని, అక్టోబర్ నెలలో ఈ పోస్టింగ్ కోసం పైరవీలు జోరుగా సాగుతున్నాయని విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు.

గతంలో ధర్మేందర్ అనే ప్రిన్సిపాల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఈ పోస్టుకు వచ్చారని, అలాగే ప్రస్తుత ప్రిన్సిపాల్ రెబ్బ శ్రీనివాస్ తొర్రూరు నుంచి నిబంధనలకు విరుద్ధంగా విదేశీ యాత్రల పేరిట హంగామా సృష్టించి ఈ పోస్ట్ దక్కించుకున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ రావాల్సి ఉంది. అడ్డదారిన వచ్చిన ప్రిన్సిపాళ్లు కళాశాల అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా, విద్యార్థులకు మేలు చేయకుండా కళాశాల ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన వారినే హనుమకొండ ప్రిన్సిపాల్‌గా నియమించాలని, లాంగ్ లీవ్, పైరవీల ద్వారా వచ్చే వారికి అవకాశం ఇవ్వరాదని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మహారాష్ట్రలో విషాదం..

## బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి





మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు.

ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు.

అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు

# రేవంత్ రెడ్డి ఏ పార్టీలో

# కాలు పెడితే ఆ పార్టీ మటాష్

■ **కేటీఆర్**

రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగుదేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ .



నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు. అదేదో ఇక్కడనే మైక్ ముందు ఒర్లితే అయిపోతుండేనన్నారు. రేవంత్ రెడ్డి అక్కడికిపోయి ఏదో దండయాత్రకు పోయినట్టు.. ఒక ముఖ్యమంత్రి, ఒక పీసీసీ ప్రెసిడెంట్, ఆరుగురు మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు.. ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయారు.. మళ్లీ పేరేమో నల్లమల పులి.. ఎక్కడన్నా నల్లమల పులి 4000 పోలీసులను పెట్టుకోని పోతడా.. అంతమందిని కాపాలా పెట్టుకోని పోయిటోడివి.. నువ్వు పులివా.. నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లి నువ్వు.. అని చురకలంటించారు

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం





## మస్త్ చేశావయ్యా..! కేసీఆర్ పాత్రలో జీవించావు..!

నటుడు ప్రియదర్శి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాను నటించిన ప్యారడైజ్ సినిమా గురించి అలాగే సినిమాలో ఆయన నటించిన శంకరన్న పాత్ర గురించి హరీష్ రావుతో ముచ్చటించారు ప్రియదర్శి, ఈ సందర్భంగా ప్రియదర్శి ఆయన సినీ ప్రయాణం, భవిష్యత్ ప్రాజెక్టులపై కూడా కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడారు. ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగే పోరాటాలు ఒక జాతి విముక్తికి ఎలా స్ఫూర్తినిస్తాయో.. మనం తెలంగాణ సాధనలో చూశామని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు. ఒక జాతి గుర్తింపు కోసం జరిగిన పోరాటాన్ని ఇటీవల వచ్చిన ప్యారడైజ్ సినిమాలో అద్భుతంగా ఆవిష్కరించారని, ఆ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రలో ప్రియదర్శి జీవించారని ఆయన కొనియాడారు.కేసీఆర్ హావభావాలు, నడక, మాట తీరును పట్టుకోవడం చాలా కష్టమని.. కానీ, ఆ పాత్రలో ప్రియదర్శి పరకాయ ప్రవేశం చేసి అత్యంత సహజంగా నటించారని ప్రశంసించారు. ఆ పాత్ర ద్వారా ప్రియదర్శి ప్రజలకు చాలా బలంగా కనెక్ట్ అయ్యారని అభినందించారు. ప్యారడైజ్ సినిమా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ యాసకు, మన పల్లె కథలకు ప్రియదర్శి కేరాఫ్ అడ్రస్‌గా మారారని హరీశ్ రావు అన్నారు. గతంలో వచ్చిన 'మల్లేశం' సినిమా ద్వారా తెలంగాణ చేనేత కార్మికుల కష్టాలను, 'బలగం' సినిమాతో మన పల్లె సంస్కృతిని, కుటుంబ బంధాలను ప్రపంచానికి అద్భుతంగా చాటిచెప్పారని గుర్తుచేశారు.ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా వచ్చి.. తన స్వయంకృషితో మట్టి కథలను మోసే అద్భుతమైన నటుడిగా ప్రియదర్శి ఎదగడం తెలంగాణకే గర్వకారణం అన్నారు. తెలంగాణ సినిమా, సంస్కృతిని మరింత ముందుకు తీసుకెళ్లేలా ఆయన భవిష్యత్తులో మరెన్నో గొప్ప ప్రాజెక్టులు చేయాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. మాజీ మంత్రి హరీశ్ రావుకి రు.కేసీఆర్ హావభావాలు, నడక, మాట తీరును పట్టుకోవడం చాలా కష్టమని.. కానీ, ఆ పాత్రలో ప్రియదర్శి పరకాయ ప్రవేశం చేసి అత్యంత సహజంగా నటించారని ప్రశంసించారు. ఆ పాత్ర ద్వారా ప్రియదర్శి ప్రజలకు చాలా బలంగా కనెక్ట్ అయ్యారని అభినందించారు. ప్యారడైజ్ సినిమా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ యాసకు, మన పల్లె కథలకు ప్రియదర్శి కేరాఫ్ అడ్రస్‌గా మారారని హరీశ్ రావు అన్నారు. గతంలో వచ్చిన 'మల్లేశం' సినిమా ద్వారా తెలంగాణ చేనేత కార్మికుల కష్టాలను, 'బలగం' సినిమాతో మన పల్లె సంస్కృతిని, కుటుంబ బంధాలను ప్రపంచానికి అద్భుతంగా చాటిచెప్పారని గుర్తుచేశారు.ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా వచ్చి.. తన స్వయంకృషితో మట్టి కథలను మోసే అద్భుతమైన నటుడిగా ప్రియదర్శి ఎదగడం తెలంగాణకే గర్వకారణం అన్నారు. తెలంగాణ సినిమా, సంస్కృతిని మరింత ముందుకు తీసుకెళ్లేలా ఆయన భవిష్యత్తులో మరెన్నో గొప్ప ప్రాజెక్టులు చేయాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. మాజీ మంత్రి హరీశ్ రావుకి నటుడు ప్రియదర్శి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజల వనటుడు ప్రియదర్శి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల కోసం

## మేడమ్ ఇది మీరేనా

పై ఫొటోలో ఉన్న దెవరో గుర్తు పట్టారా? ఈమె ఒకప్పుడు టాలీవుడ్ లో ఫేమస్ హీరోయిన్. స్టార్ హీరోలతో కలిసి బ్లాక్ బస్టర్స్ సినిమాల్లో యాక్ట్ చేసింది. ఒక్క తెలుగులోనే కాదు తమిళం, కన్నడ, మలయాళం. .ఇలా దక్షిణాది భాషలన్నింటిలోనూ సినిమాలు చేసిందీ అందాల తార. వందలాది సినిమాల్లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ తన అభినయ ప్రతిభకు ప్రతీకగా జాతీయ ఉత్తమ నటి పురస్కారం కూడా అందుకుంది. అలాగే తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే కలైమామణి పురస్కారం కూడా సొంతం చేసుకుంది. అయితే ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ సినిమాలు చేయడం లేదు.వందలాది సినిమాల్లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ తన అభినయ ప్రతిభకు ప్రతీకగా జాతీయ ఉత్తమ నటి పురస్కారం కూడా అందుకుంది. అలాగే తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే కలైమామణి పురస్కారం కూడా సొంతం చేసుకుంది. అయితే ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ సినిమాలు చేయడం లేదు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోన్న ఈ ముద్దుగుమ్మ తాజాగా కొన్ని ఫొటోలను తన ఇన్ స్టా గ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. అందులో చక్కని చీరకట్టుతో తలలో పూలతో ఎంతో సాంప్రదాయంగా కనిపించిందీ ముద్దుగుమ్మ. మొదట ఈమెను చూసి చాలా మంది గుర్తు పట్టలేకపోయారు. మరి మీరు గుర్తు పట్టారా?

సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోన్న ఈ ముద్దుగుమ్మ తాజాగా కొన్ని ఫొటోలను తన ఇన్ స్టా గ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. అందులో చక్కని చీరకట్టుతో తలలో పూలతో ఎంతో సాంప్రదాయంగా కనిపించిందీ ముద్దుగుమ్మ. మొదట ఈమెను చూసి చాలా మంది గుర్తు పట్టలేకపోయారు. మరి మీరు గుర్తు పట్టారా? ఈ అందాల తార మరెవరో కాదు ఒకప్పుడు పలు తెలుగు హిట్ సినిమాల్లో హీరోయిన్ గా నటించిన మీరా జాస్మిన్. అమ్మాయి బాగుంది, గుడుంబా శంకర్, భద్ర, మహారథి, రారాజు, యమగోల మళ్లీ మొదలైంది, గోరింటాకు, మా ఆయన చంటి పిల్లాడు, బంగారు బాబు, అ ఆ ఇ ఈ, ఆకాశ రామన్న తదితర చిత్రాలు మీరాకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి.ఈ అందాల తార మరెవరో కాదు ఒకప్పుడు పలు తెలుగు హిట్ సినిమాల్లో హీరోయిన్ గా నటించిన మీరా జాస్మిన్. అమ్మాయి బాగుంది, గుడుంబా శంకర్, భద్ర, మహారథి, రారాజు, యమగోల మళ్లీ మొదలైంది, గోరింటాకు, మా ఆయన చంటి పిల్లాడు, బంగారు బాబు, అ ఆ ఇ ఈ, ఆకాశ రామన్న తదితర చిత్రాలు మీరాకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి.కాగా హీరోయిన్ గా కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే అనిల్ జాన్ టైటస్ అనే వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుంది మీరా జాస్మిన్. 2014 లో వీరి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత చాలా రోజుల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈ అందాల తార ఇటీవలే సెకెండ్ ఇన్నింగ్స్ షురూ చేసింది.

కాగా హీరోయిన్ గా కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే అనిల్ జాన్ టైటస్ అనే వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుంది మీరా జాస్మిన్.



## అన్నా ఇది నువ్వేనా! హీరో రామ్‌తో ఉన్న ఈ జబర్దస్త్ స్టార్ కమెడియన్‌ను గుర్తు పట్టారా?



పై ఫొటోలో హీరో రామ్ తో ఉన్న యువకుడిని గుర్తు పట్టారా? ఇతను ఇప్పుడు టాలీవుడ్ లో ఫేమస్ కమెడియన్. 1997లోనే సినిమా ఇండస్ట్రీలోకి వచ్చాడు. చాలా సినిమాల్లో నటించాడు. ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ తదితర స్టార్ హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. అప్పట్లో ఒత్తైన జుట్టు.. మంచి హెయిర్ స్టైల్‌తో ఉన్న ఇతను హీరో అవుదామనే ఇండస్ట్రీలోకి వచ్చాడు. కానీ సినిమాల్లో ఎక్కువగా సైడ్ క్యారెక్టర్ రోల్స్ వచ్చాయి. దీంతో పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయాడు. అయితేనేం తనకొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని పాత్రలు చేస్తూ పోయాడు. ఎప్పుడైతే జబర్దస్త్ లోకి అడుగు పెట్టాడో ఈ నటుడి జీవితమే మారిపోయింది. ఎన్నో ఏళ్లుగా నటించినా రానీ గుర్తింపు ఒక్క జబర్దస్త్ కామెడీ షోతో సొంతం చేసుకున్నాడు. ఈ కామెడీ షోలో తన దైన యాక్టింగ్, గెటప్పులతో ఆడియెన్స్ ను కడుపుబ్బా నవ్విస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా దర్శక కేంద్రుడు రాఘవేంద్ర రావు ను అనుకరిస్తూ బాగా హైలెట్ అయ్యాడీ కమెడియన్. ఒక షోలో రాఘవేంద్ర రావు గెటప్పులో ఇతనిని చూసి స్వయంగా మెగాస్టార్ చిరంజీవి ఆశ్చర్యపోయారు. ఇప్పుడు సినిమాల్లోనూ నటిస్తూ బిజీ బిజీగా ఉంటున్న ఈ కమెడియన్ మరెవరో కాదు జబర్దస్త్ ఫేమ్ గడ్డం నవీన్.కాగా జబర్దస్త్ లోకి రాక ముందు పలు సినిమాల్లో నటించారు నవీన్. రామసక్కనోడు, ఆది, ఇష్టం, 16 టీన్స్, ఇడియట్, నాగ, బ్యాడ్ బాయ్స్ తదితర హిట్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో తళుక్కుమన్నారు. ఎక్కువగా విలన్ గ్యాంగ్స్ లోనే కనిపించిన ఆయన అదిరే అభి, చలాకీ చంటి సహాయంతో జబర్దస్త్ లోకి అడుగు పెట్టాడు. ముఖ్యంగా అదిరే అభి టీమ్ లో అభి, రాముతో కలిసి నవీన్ చేసిన స్కిట్స్ ఆడియెన్స్ ను కడుపుబ్బా నవ్వించాయి. ఇక పై ఫొటో విషయానికి వస్తే.. హీరో రామ్ పోతినేని నటించి మొదటి సినిమా దేవదాసు టైమ్ లో తీసుకున్నదని తెలుస్తోంది.

## థియేటర్లలో సినిమాల పండుగ.. ఒక్కరోజే 10 చిత్రాలు రిలీజ్



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఈ వారం వినోదాల విందు నెలకొనబోతోంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా వరుస సెలవులు రావడం, వీకెండ్ కలసిరావడంతో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎత్తున సినిమాలు పోటీకి దిగుతున్నాయి. ఏకంగా ఒకే రోజు దాదాపు 10 సినిమాలు థియేటర్లలోకి రానుండటంతో సినీ ప్రియులకు పండుగ వాతావరణం నెలకొంది. చిన్న సినిమాలు, డబ్బింగ్ చిత్రాలు, భారీ కాన్సెప్ట్ సినిమాలు ఇలా రకరకాల జోనర్లలో ప్రేక్షకులు అలరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ వారం విడుదలవుతున్న చిత్రాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్నది 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. మలయాళ వర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్ హీరోగా శశాంక్ యేలేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫాంటసీ కామెడీ డ్రామాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఆర్కా మీడియా, ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.మరో క్రేజీ ప్రాజెక్ట్ 'సిగ్మా'. సందీప్ కిషన్ కథానాయకుడిగా, ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించిన ఈ హీస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మనవడు, నటుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించడం విశేషం. వీటితో పాటు నివిన్ పాలీ, సూరి కాంబినేషన్‌లో రామ్ దర్శకత్వం వహించిన తమిళ సైకలాజికల్ థ్రిల్లర్ 'సంచారి' కూడా తెలుగులో అలరించేందుకు సిద్ధమైంది. బాలీవుడ్

## 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమాలో నటించిన ఈ పాప ఎవరో తెలుసా?



మలయాళం నటుడు ఫహాద్ ఫాజిల్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. ఆర్కా మీడియా వర్క్స్, షోవింగ్ బిజినెస్ బ్యానర్స్ పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ ఎస్ కార్తికేయ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. అలాగే దర్శక ధీరుడు రాజమౌళి ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తుండడంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయిఅడ్వెంచర్ ఫాంటసీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం (అక్టోబర్ 02)న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో సారా పాలేకర్ అనే ఛైల్డ్ ఆర్టిస్ట్ ఓ కీలక పాత్ర చేసిందిఅడ్వెంచర్ ఫాంటసీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం (అక్టోబర్ 02)న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో సారా పాలేకర్ అనే ఛైల్డ్ ఆర్టిస్ట్ ఓ కీలక పాత్ర చేసింది.ఇప్పటివరకు ఈ సినిమా నుంచి రిలీజైన గ్లింప్స్, ట్రైలర్ కంటెంట్ లో ఫహాద్ ఫాజిల్ తో పాటు ఈ పాపనే ఎక్కువగా కనిపించింది. ఈ మూవీ మొత్తం దాదాపు వీరిద్దరి చుట్టూనే తిరుగుతుందని తెలుస్తోంది. ఇక మంగళవారం (సెప్టెంబర్ 29) జరిగిన ఈ సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్లోనూ సారా నే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది.ఇప్పటివరకు ఈ సినిమా నుంచి రిలీజైన గ్లింప్స్, ట్రైలర్ కంటెంట్ లో ఫహాద్ ఫాజిల్ తో పాటు ఈ పాపనే ఎక్కువగా కనిపించింది. ఈ మూవీ మొత్తం దాదాపు వీరిద్దరి చుట్టూనే తిరుగుతుందని తెలుస్తోంది. ఇక మంగళవారం (సెప్టెంబర్ 29) జరిగిన ఈ సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్లోనూ సారా నే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ ఛైల్డ్ ఆర్టిస్ట్ కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. నెటిజన్లు కూడా ఈ చిన్నారి ఎవరో, తన బ్యాక్ గ్రౌండ్ ఏంటో తెలుసుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్యూటీ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.ప్రస్తుతం ఈ ఛైల్డ్ ఆర్టిస్ట్ కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. నెటిజన్లు కూడా ఈ చిన్నారి ఎవరో, తన బ్యాక్ గ్రౌండ్ ఏంటో తెలుసుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్యూటీ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2017లో పుట్టిన సారా పాలేకర్.. నాలుగేళ్లకే అంటే 2021లో నటించడం మొదలుపెట్టింది. మరాఠీలో కొన్ని సీరియల్స్, టీవీ షోల్లో చేసింది సారా. అలాగే కొన్ని ఆల్బమ్ సాంగ్స్ కూడా చేసింది. ఇక ప్రస్తుతం సినిమాల్లో బాలనటిగా రాణిస్తోంది సారా. గతంలో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ సినిమాలోనూ సారా పాలేకర్ వెంకీ కూతురిగా నటించింది.2017లో పుట్టిన సారా పాలేకర్.. నాలుగేళ్లకే అంటే 2021లో నటించడం మొదలుపెట్టింది. మరాఠీలో కొన్ని సీరియల్స్, టీవీ షోల్లో చేసింది సారా. అలాగే కొన్ని ఆల్బమ్ సాంగ్స్ కూడా చేసింది. ఇక ప్రస్తుతం సినిమాల్లో బాలనటిగా రాణిస్తోంది సారా. గతంలో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ సినిమాలోనూ సారా పాలేకర్ వెంకీ కూతురిగా నటించింది. ఇప్పుడు మళ్లీ డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224